website: www.zaminryot.com E-mail : zaminryot1930@gmail.com



స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 96 సంచిక: 30 • 24-7-2026 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.10/-

ఎంతలే అనుకొన్న బొద్దింకలు దేశ రాజకీయ ముఖ చిత్రం మార్చే తీరులో ప్రకంపనలు సృష్టించారు

దేవదూత గుండెలు కూడా దద్దరిల్లాయి

- **భవిష్యత్తు మీద దేశ యువతలో ఎంత భయం వుందో కళ్లకు కట్టింది**
- **రాజకీయ వ్యవస్థల మీద యువతలో విశ్వాసం సడలిపోవడం ఎంత మాత్రం హితం కాదు**
- **ధర్మేంద్ర ప్రధాన్‌తో ముడిపడిన వేల కోట్ల పెట్రోల్ విరాళాలు, కుంభకోణాలు బయటకు వస్తాయనే బెరుకు**
- **భారత దేశంలో ప్రజాస్వామ్యం పట్ల ప్రజలలో మక్కువ తగ్గలేదని నిరూపణ**
- **యువత తలచుకొంటే అధికార పీఠాలు పేక మేడల వలె కూలిపోక తప్పదు**

సరిగ్గా నెలన్నర క్రితం, 'జమీన్‌రైతు' పతాక శీర్షికలో, బొద్దింకల భూకంపం రాబోతోందని ప్రకటించాము. ఆ రోజు ఆ మాటను ఎవ్వరూ విశ్వసించలేదు. అండపిండ బ్రహ్మాండమంతగా విస్తరించిన నరేంద్ర మోడీ ప్రభావం ముందు బొద్దింకలు గంతులేయడం ఎలా సాధ్యమని భావించారు. కానీ నేటికి 'జమీన్‌రైతు' వాక్కే నిజమైంది. దేశ రాజకీయాల్లో ఒక పెను భూకంపం సృష్టించింది బొద్దింకల పార్టీ. మోడీ అంతటి వాడు, అహంకారాన్ని తీసి పక్కనపెట్టి, కాక్రోచ్ జనతా పార్టీ లేవనెత్తిన వివాదంపై వివరణ ఇచ్చాడంటే, బొద్దింకలు సృష్టించిన భూకంపం ఏ స్థాయిలో అధికార పీఠాన్ని కదిలించిందో అర్థం చేసుకోవచ్చు.

గత పన్నెండేళ్లలో ప్రధాని హోదాలో ఒక వివాదంపై మోడీ ఈ స్థాయిలో స్పందన చూపిన సాదృశ్యం వేరొకటి లేదు. పంజాబ్ రైతులు నెలల తరబడి ఢిల్లీ శివార్లలో తిష్ట వేస్తే పట్టించుకోలేదు; రాజస్థాన్ జాట్లు రైళ్లను స్తంభింపజేస్తే, తనకు కనబడనట్లే వుండిపోయాడు. అదానీకి దేశాన్ని దోచి పెడుతున్నారని ఎందరు ఎన్నివిధాలా గోల చేస్తున్నా వినిపించుకోలేదు. ఆపరేషన్ సింధూర్‌లో భారత సైనికులు చనిపోయారన్నా, భారత వాయుసేన విమానాలు కూలిపోయాయన్నా తనకు నిమిత్తం లేదన్నట్లే వుండిపోయాడు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం దేశాన్ని ఆర్థికంగా కుంగదీస్తుందని ఆర్థిక నిపుణులు గగ్గోలు పెడుతున్నా లెక్క చేయలేదు. డోనాల్డ్ ట్రంప్ తనను పలుమార్లు అవహేళన చేసినా, పాకిస్తాన్‌తో భారత యుద్ధాన్ని తానే ఆపించానని పదే పదే ప్రకటనలు చేసినా సిగ్గుపడి దేశ ప్రజలకు వివరణ ఇవ్వలేదు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో మాట్లాడకపోవడాన్ని విదేశీ మీడియా ఎంత గేలి చేసినా మౌనంగా వుండిపోయాడు. ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పకపోవడం, ఎంత పెద్ద సమస్యనైనా తేలికగా చూడడం మోడీ రాజకీయ శైలి. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలంటే ఆయనకు ఎక్కడలేని ఎగతాళి. లోక్‌సభలో, బయట వారు ఎన్నో ఆరోపణలు చేసినా చెవిలోకి దూర్చుకోకపోవడం ఆయన ఆత్మవిశ్వాసానికి సంకేతం. నేను దైవ దూతను, నా జన్మ అందరి వలె మానవ జన్మ కాదు, భారత దేశ ప్రజలు నన్ను తప్ప మరొకరిని నమ్మరు, నేను ఏ తప్పు చేసినా జనం గుడ్డిగా దాన్ని ఒప్పుగా భావిస్తారు అనేది ఆయన పాటించే మతం. అందువల్లే నీట్ పరీక్షల వైఫల్యం 22 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మనోవేదనకు కారణమైనా అదేమీ పెద్ద సంగతి కాదన్నట్లే వుండిపోయాడు. కాక్రోచ్ జనతా పార్టీ పేరిట జంతర్ మంతర్ ధర్నా కేంద్రంలో జరుగుతున్న ఆందోళనను కానీ, వారికి మద్దతుగా సోనమ్ వాంగ్ చుక్ చేపట్టిన నిరాహార దీక్షను కానీ లెక్కలోకి తీసుకోలేదు. నెల రోజులుగా విద్యార్థుల గగ్గోలు కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించలేక పోయింది. వారు పార్లమెంట్ ముట్టడి పిలుపు ఇచ్చినా ఒక్క పోలీసు అధికారి కూడా దాన్నొక సమస్యగా పరిగణించలేదు. పట్టుమని పది వేలకు మించి నిరసన ముట్టడిలో పాల్గొనే జనం వుంటారని, వారిని నియంత్రించడం చిటికెలో పని అని తేలికగా తీసుకున్నారు. పొద్దున పరిస్థితి చూస్తే అట్లానే కన్పించింది. కానీ గంటలు గడిచే కొద్దీ, ఢిల్లీ వీధులు జన సముద్రం వలె మారిపోయాయి. వాహనాలు లేవు, పిలిచిన వారు లేరు, పిలిపించిన వారు లేరు, జనసమీకరణ విద్యలేవీ ప్రదర్శించ లేదు, కానీ వేలాది జనం పోటెత్తి వచ్చారు. అన్ని దారుల్లోనూ జనం. ఆ సమూహాన్ని చూసిన పోలీసు అధికారులకు కళ్లు బైర్లు కమ్మాయి. పార్లమెంట్‌లోకి దూసుకొని వచ్చేస్తారనే భయంతో పరుగులు పెట్టి మరీ అన్ని గేట్లు మూసివేశారు. ఎంతమంది పోలీసులను తరలించినా, వారెంత రాక్షసంగా లాఠీలతో చావబాదినా, టియర్ గ్యాస్ షెల్స్ పేల్చి కళ్లు

మండిపోయే పరిస్థితి కల్పించినా విద్యార్థులు లెక్క చేయలేదు. వచ్చిన వారిలో పదిహేను, పదహారేళ్ల పసిపిల్లలు కూడా వుండడం, ఖరీదైన కార్పొరేట్ స్కూళ్లలో చదివే పిల్లలు తరలి రావడం, స్కూల్ యూనిఫారంతోనే కదం తొక్కడం ప్రభుత్వాన్ని గడగడ వణికించాయి. ఆ పరిస్థితి మోడీ ఊహించలేదు; అమిత్ షా అంచనా వేయలేదు. ఈ గండం గట్టెక్కితే చాలుననే స్థితికి చేరుకుంది కేంద్ర ప్రభుత్వం.

ఈ విద్యార్థి లేదా యువత సమూహానికి ఏ సిద్ధాంత ప్రేరణ లేదు; ఏ రాజకీయ పార్టీ అండ లేదు; ఎవరి మార్గదర్శనం లేదు. కేవలం తమ భవిష్యత్తు ఏమిటి అనే ప్రశ్నకు సమాధానం దొరకని అయోమయంలో, అనిశ్చితిలో, ఆందోళనలో ఉన్న యువతీ యువకులు ప్రభుత్వాన్ని నిలదీయడానికి సాహసించారు. పోలీసులను, వారి లాఠీలను చూసి భయపడలేదు. పోలీసు తుపాకికి గుండె చూపించిన ధీరోద్ధాతత గురించి స్వాతంత్ర్య సమరంలో కథలు విన్నాము. ఇక్కడ కళ్లారా చూశాము. ఒక యువకుడు పోలీసుల మధ్య నిలబడి కొట్టండి, ఇంకెంత కొడతారో కొట్టండి అని సవాలు చేశాడు. మరో యువకుడు పోలీసుల వద్దకు దూసుకెళ్లి, కాలుస్తారా కాల్చండి అని చొక్కా గుండీలు విప్పి కేకలు పెట్టాడు. యువతలోని ఆ సాహసాన్ని చూసిన పోలీసు బలగాలు సిగ్గుతో వెనక్కి తగ్గాయి తప్ప, వచ్చిన యువతలో భయం కనిపించలేదు. పదిహేనేళ్లు కూడా లేని ఆడపిల్లలు మమ్మల్ని కొట్టే అధికారం మీకెవరిచ్చారని గట్టిగా నిలదీస్తూ నిటారుగా నిలిచి పోయారు పోలీసు అధికారులు. ఈ మొత్తం పరిణామం భారతదేశంలో ప్రజాస్వామ్యం ఇంకా ప్రాణంతోనే మిగిలి వుందన్న భరోసా కల్పిస్తోంది. జనంలో తిరుగుబాటు వస్తే, ప్రశ్నించే ధోరణి అలవడితే, ఎంత పెద్ద పోటుగాడు పాలకుడిగా వున్నా పిల్లి వలె తోక ముడవక తప్పదని అర్థమౌతున్నది.

సాధారణంగా ఒక ఉద్యమం హింసాయుతంగా మారితే, దాని పొంగు చల్లారిపోతుంది. కానీ విచిత్రంగా కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం మాత్రం పార్లమెంట్ ముట్టడి తర్వాత కూడా, పోలీసుల లాఠీ దెబ్బల హింస తర్వాత కూడా నిరంతరాయంగా కొనసాగడం గొప్ప విశేషం. ఉత్తరాది రాష్ట్రాలన్నిటి

కొరవ 14వ పేజీలో

చిగురు కొమ్మలో చేవ

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారిక నివాసం ఎదుట ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ జరిపిన ధర్నా ఒక విశేషమైన పరిణామం. ఆయన నాయనమ్మ ఇందిరా గాంధీ ప్రదర్శించిన సాహసోపేత రాజకీయ వైఖరిని గుర్తుచేసిన సందర్భమిది. 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇందిరమ్మ పైన తీవ్ర అణిచివేత వైఖరి ప్రదర్శితమైంది. అప్పటివరకు అపర కాళికా మాతగా ప్రశంసించిన ప్రతిపక్ష నేతలు ఆమెను ఒక రాక్షసిగా ప్రజలకు చూపే ప్రయత్నం చేశారు. దేశంలోని పత్రికలన్నీ అత్యవసర పరిస్థితి అత్యాచారాల మీద పుంఖానుపుంఖాలుగా కథలు వండి వార్చాయి. షా కమిషన్ విచారణ పేరుతో ప్రతిరోజు ఇదొక చర్చగా నిర్వహించింది మొరార్జీ సర్కారు. ఆమెపై వేయని నింద లేదు. ఆమె మీద జరపని దుష్ప్రచారం లేదు. ఆ క్రమంలో ఒక రోజు ఆమెను అరెస్ట్ చేశారు కూడా. అయితే, పక్కరోజు పొద్దున న్యాయమూర్తి ఆ అరెస్టును తప్పు పట్టాడు. కానీ ఆధారాలు కూడా లేకుండా అరెస్ట్ ఏమిటని పోలీసులకు చీవాట్లు పెట్టాడు. దేశంలో ఆమె ఎక్కడకు వెళ్లినా దాడులు చేశారు. మధురై నగరంలో కరుణానిధి సమీకరించిన ఒక గుంపు ఆమె ప్రయాణించే కారుపై రాళ్లు విసిరింది. దానితో కారు అద్దాలు పగిలి, ఇందిరమ్మ ముఖం మీద గాయమైంది; నెత్తురు కారింది. ఇంత భీతావహ పరిస్థితులలో, బీహార్‌లోని ఒక మారుమూల గ్రామంలో దళితుల ఊచ కోత దుర్ఘటన జరిగింది. ఇందిరమ్మ ఆ దళితులను పరామర్శిస్తానని ప్రకటించారు. ఆమె అక్కడకు వెళ్లకుండా ఎన్ని అవరోధాలు కల్పించాలో, అన్నీ చేసింది కేంద్ర ప్రభుత్వం. ఆమె కొంత దూరం రైలులో, ఆ తర్వాత బస్సులో, అది దిగి ఒక ట్రాక్టరులో, దాన్ని కూడా పోలీసు అడ్డుకోవడంతో రెండెద్దుల బండి మీద, చివరకు ఏనుగుపై సవారీతో దళితుల పరామర్శకు వెళ్లారామె. అదొక సాహసోపేతమైన, చారిత్రాత్మకమైన రాజకీయ ప్రయాణం. ఆ సాహసమే జనతా పార్టీకి మరణ శాసనం లిఖించింది. నియంతగా, ప్రజాస్వామ్య హంతకిగా, మానవ హక్కులను హరించిన గూండాగా ప్రతిపక్షాలు జరిపిన ప్రచారాన్ని నమ్మిన ప్రజలు 1977లో ఇందిరమ్మను ద్వేషించారు. కానీ రెండున్నరేళ్ల స్వల్ప వ్యవధిలో అదే ప్రజలు తమ అభిప్రాయాలను మార్చుకొన్నారు. 1980లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో ఇందిరమ్మకు పట్టాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ భూస్థాపితమై పోయింది, ఇక బ్రతికి బట్టకట్టదని యావత్ ప్రపంచం బలంగా నమ్మిన పరిస్థితుల నుంచి, ఫీనిక్స్ పక్షి వలె పునరుత్థానం చెందింది కాంగ్రెస్ పార్టీ. జనతా పార్టీ అంతరించిపోయింది.

అచట పుట్టిన చివురు కొమ్మైన చేవ అన్న కవి వాక్యాన్ని రుజువు చేశాడు రాహుల్ గాంధీ ఇప్పుడు. బిజెపి పార్టీ, దాని నియంత్రణలోని యావత్ మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాలు రాహుల్ గాంధీ మీద గత పన్నెండేళ్లుగా ఎంత విష ప్రచారం చేస్తున్నాయో తెలిసిన సంగతే. రాహుల్ గాంధీని పప్పు అన్నారు; కూర్చున్నా, నిలుచున్నా, వేసుకొన్న చొక్కా నుంచి ప్రతి అంశాన్నీ అవహేళన చేశారు; అవమానాలకు గురి చేశారు; పరువు నష్టం కేసు పేరుతో జైలు శిక్ష విధింపచేశారు; లోక్‌సభ సభ్యత్వాన్ని ఆగమేఘాల మీద రద్దు చేశారు; నేషనల్ హెరాల్డ్ పేరుతో తప్పుడు కేసు సృష్టించి, ఈడి దాడులు జరిపారు; సోనియా గాంధీని కూడా అరెస్ట్ చేసి, జైలులో పెడతామని బెదరించారు; కాంగ్రెస్ ముక్తభారత్ సాధించామని ఛాతీ చరచుకొన్నారు. ఈ అవమానాలను, అవహేళనలను దిగమ్రింగి, భరించి, తన మనసును స్థిరం చేసుకొన్న రాహుల్ గాంధీ ఇప్పుడు అదే బిజెపి గుండెల్లో సింహస్వప్నంగా మారాడు. ప్రధాని అధికార నివాసం ముందు ధర్నా అనేది అత్యంత సాహసోపేతమైన నిర్ణయం. ఆయన అక్కడకు వెళ్లేవరకు ఇంటెలిజెన్స్ వ్యవస్థ పసిగట్టలేక పోవడం, రాహుల్ ప్రదర్శించిన రాజకీయ చాతుర్యం. ఈ ధర్నా దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చబోతున్నది. మృతప్రాయంగా మారిన కాంగ్రెస్ పార్టీకి ఈ ధర్నా, మృత సంజీవని వలె పని చేయబోతున్నది. రేపటి నుంచి దేశ రాజకీయాలు వేరుగా వుంటాయనడం అతిశయోక్తి కాదు.

జమీన్‌రైతు

జనవాక్కు

మాట మీద నిలబడని జగన్

వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఇటీవల ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మాటలు, ఆ పార్టీ మొత్తాన్ని తీవ్రంగా బాధపెట్టాయి. జగన్మోహన్‌రెడ్డి ఎందుకట్లా మాట్లాడాడు, నవ్వులాటగా వుందని తెలిసినా 'మావిగన్' అనే నినాదం మీదనే రేపటి ఎన్నికలలో పోటీ చేస్తామని చెప్పడంలో ఆయన ఉద్దేశ్యం ఏమిటి? ఒక వైపు అమరావతిలో రాజధాని నిర్మాణం జరిగిపోతుండడం చూస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధాని అమరావతి అని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత కొత్త రాజధాని ప్రతిపాదన వివాదాన్ని రేకెత్తించడంలో జగన్మోహన్‌రెడ్డి ఆంతర్యం ఏమిటన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు.

పి.అరుణకుమారి — నెల్లూరు

లోకేష్ ఎందుకలా?

జిల్లాలలో జరిగే పర్యటనల విషయంలో అచ్చు జగన్‌ను పోలిన పద్ధతిని రాష్ట్ర మంత్రి లోకేష్ పాటించడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఇటీవల లోకేష్ దివిసీమ పర్యటన జరిపారు. ఒక పాడుపడిన పాఠశాల సందర్శించి, దాని పునరుద్ధరణ ప్రకటన చేయడం పర్యటన ఉద్దేశం. కానీ తీరా ఆయన అక్కడకు వచ్చేసరికి రాబిన్‌శర్మ టీమ్ రచించిన కొరియోగ్రాఫ్ వీడియో షూట్ దృశ్యాలు వెలికి వచ్చాయి. మొత్తం కార్యక్రమాన్ని ఒక సినిమా షూటింగ్ తరహాలో నడిపారు. లోకేష్ ఎప్పుడు నవ్వాలి, ఎప్పుడు చిరాకు పడాలి, ఎప్పుడు ఏ హావభావాలు ప్రదర్శించాలి అన్న అంశాలన్నిటినీ రాబిన్‌శర్మ టీమ్ దగ్గరుండి నేర్పిస్తూ పర్యటన జరిపించడం ఆశ్చర్యపరిచింది.

ఎ.సతీష్‌కుమార్ — నెల్లూరు

మోడీగారు మాట్లాడాలి

అయోధ్య రామాలయ నిర్వహణకు తాను ఎంపిక చేసిన వారిలో దొంగలున్నారనే నిజం బయటపడిన తర్వాత మోడీ గారు ఒక మాట మాట్లాడలేదు. అసలా చందా చోరీ తనకు తెలియనే తెలియదన్నట్లు నటిస్తున్నాడు. కొన్ని కోట్ల మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశం ఇది. ఆర్ఎస్ఎస్ ఏరికోరి నియమించిన వ్యక్తులు రాముడికి భక్తులిచ్చిన కానుకలను తస్కరించి తమ ఇళ్లలో మరుగుదొడ్లలో దాచిపెట్టారన్న వార్త వింటేనే మనసు కలచి వేస్తుంది. కానీ ఆర్ఎస్ఎస్ పెద్దలకు కానీ, మోడీ గారికి కానీ చీమకుట్టినట్లు లేకపోవడం బాధాకరం.

పి.జ్యోత్స్న — కోవూరు

గ్యాస్ సిలిండర్ రేటు తగ్గించాలి

వంట గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం పెంచుకొంటూ పోతుంది.

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

10-8-1956
పేజీలు:12 వెల:0-2-0అణా

నెల్లూరు ముచ్చట్లు

పార్లమెంటు సభ్యత్వం

నెల్లూరు పార్లమెంట్ జనరల్ సీటుకు కాంగ్రెస్ పక్షాన వెన్నెలకంటి రాఘవయ్యగారొక్కరే దరఖాస్తు పెట్టినట్లున్నది.

రేబాల దశరథరామిరెడ్డి గారి పేరు ఈ మధ్యంతా వినవస్తూనే వుండినది. కాని దరఖాస్తు మాత్రం పెట్టనందువల్ల సందేహిస్తూనే వుండినారు. రామచంద్రారెడ్డి గారు ఉండేట్టు వుంటే దశయ్య నిలవరన్న వదంతి గుడా వున్నమాట నిజమే. అయితే అది యదార్థం గాదు. కాకతాళీయంగా రామచంద్రారెడ్డి గారు నిలబడడం ఖాయమైందని, దశయ్య విరమించుకోవడం స్థిరపడిందని తెలుస్తున్నది. దశయ్య నిలిస్తే ఒక లక్ష రూపాయల కట్టగట్టి పెట్టవలసి వుంటుంది. ఇంతడబ్బు ఒక్కరు భరించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. వేరే కమిటీ యేర్పడి చందాలు వసూలుచేసి ఎలక్షన్ ఖర్చు పెట్టడానికి దశయ్య అంతగా ఒప్పుకోడనుకుంటాము. ఈ ఒక్క కారణం చేతనే ఆయన మానుకొని యుంటాడేమో?

మొత్తానికి రాఘవయ్య గారు ఒక్కరే కాంగ్రెసు పక్షాన నిలుస్తారని తేలింది.

గత పర్యాయం 6 వందల ఓట్లతోనే రాఘవయ్య ఓడిపోవడం తటస్థించింది. ఇంక కొంత ప్రయత్నం జరిగియుంటే తప్ప గెల్చి యుండేవాడు.

దానికి కారణం కొంత రాఘవయ్య గారి స్వయంకృత అపరాధము.

50 ఏళ్ల క్రితం ఈవారం

6-8-1976
పేజీలు:10 వెల:0-50పై

నెల్లూరు ముచ్చట్లు

జి.సి.కొండయ్య

పెరోల్ మీద విడుదలైన శ్రీ జి.సి.కొండయ్య నెల్లూరు శివార్లు దాటి పోగూడదన్న షరతును ప్రభుత్వం రద్దు చేసింది. వైద్య నిమిత్తం తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వెళ్లవచ్చునని ఉత్తర్వులిచ్చింది.

విజయభేరి ఆగిపోయింది

శ్రీ ధనెంకుల నరసింహం సంపాదకత్వాన వెలువడ్తున్న 'విజయభేరి' వారపత్రిక 5తేది నుంచి ఆగిపోయింది. పత్రిక ప్రచురణకు ముందే సెన్సార్ కావాలని కలెక్టరు ఆదేశించారని, అందువల్ల ప్రచురణ ఆపివేశారని తెలుస్తుంది.

పరిస్థితులు కుదుటపడిన తర్వాత పత్రిక పునఃప్రారంభించగలమని శ్రీ నరసింహం తెలియజేస్తున్నాడు.

అప్పల నరసమ్మ మరణం

డాక్టర్ అప్పల నరసమ్మ గారు 5తేది రాత్రి మద్రాసులో కన్నుమూశారు.

30ఏళ్ల క్రితం నెల్లూరులో డాక్టరమ్మ అంటే అప్పల నరసమ్మ గారొక్కర్నే చెప్పుకొనేవారు. ఆమె నెల్లూరులో పుట్టలేదు; నెల్లూరులో పెరగలేదు. కానీ నెల్లూరీయురాలు అయింది. దాదాపు 40ఏళ్ల క్రితం ఆమె యిక్కడి జూబ్లీ హాస్పిటల్‌కు డాక్టరమ్మగా వచ్చింది. ప్రేమతో, దయతో, సానుభూతితో, నిజాయితీతో సేవా దృష్టితో తన వృత్తిని నిర్వహించింది.

నెల్లూరు ముచ్చట్లు

దర్గా కమిటీ పేరుకే...

నెల్లూరు బారాషహీద్ దర్గా దగ్గర జరిగిన రొట్టెల పండుగ సందర్భంగా భక్తులకు చేదోడు వాదోడుగా ఉంటారని ప్రతి యేడు వక్ఫ్‌బోర్డు ఒక కమిటీని నియమిస్తుంది. దీనిలో ఈ యేడాది 110 మంది సభ్యులను నియమించింది. కాని ఈ సభ్యులు మెడలో కార్డులు వేసుకొని దర్గా పరిసర ప్రాంతాలలో తిరగడం తప్ప దేనికి ఉపయోగపడలేదన్న విమర్శ రేగింది. వచ్చే ఏడాదైనా కాస్త సేవాభావం, ఓపిక ఉన్న వారిని ఈ కమిటీలో నియమిస్తే బాగుంటుంది.

దర్గాలో చర్చి దీవెనలు

నెల్లూరు బారాషహీద్ దర్గాలో 'ఫాతేహా' అరబ్బీలో చదవాలి. దీనిలో 'ఐతల్ కుర్సీ' సూరా ముఖ్యం. దర్గాకు దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి వచ్చినప్పుడు అక్కడ చదివింపులు చేస్తుండిన ముజావర్ కాని ముజావర్ చర్చిలో ఫాదర్ మాదిరి తెలుగు దీవెనలకు దిగారు. ఇది సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యింది. దీనిని చూసినవారు ఔరా అంటూ నిట్టూర్చారు.

అంతా ఆయనే!

నెల్లూరు బారాషహీద్ దర్గాలో ఈసారి పండుగల బాధ్యతలన్నీ తెలుగుదేశం పార్టీలోని ఒక ముస్లిం నాయకుడు నిర్వర్తించారు. దీని నిర్వహణ సామర్థ్యం ఆయనకు లేకపోవడం వల్ల లక్షల మంది భక్తులు రకరకాల ఇబ్బందులు పడ్డారు. లక్షల మంది భక్తులు వచ్చిన ఈ పండుగకు చెప్పులు భద్రపరచుకోను స్టాండ్ పెట్టాలన్న ఆలోచన ఆయనకు రాలేదు. దీంతో ఎక్కడంటే అక్కడ భక్తులు వదిలిన చెప్పులను మునిసిపల్ చెత్త వాహనాల్లో వేసుక వెళ్లారు. దీంతో షుగర్ వ్యాధిగ్రస్తులైన భక్తులు నానాపాట్లు పడ్డారు. 4.19 కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించిన ఈ వేడుకలో చెప్పుల స్టాండు ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుందని చెప్పండి?

మినీ బైపాస్‌పై కంకర, ఇసుక

నెల్లూరు వనంతోపు ప్రాంతంలో మినీ బైపాసు రోడ్డుపై అగర్వాల్ కంటి ఆసుపత్రి సెంటర్‌లో వారం పదిరోజులు కంకర, ఇసుక లోడులు ట్రాఫిక్‌కు అడ్డంగా ఉండినా ఏ ఒక్కరు ప్రక్కకు జరపలేదు. కంకర, ఇసుకతో ఇక్కడ ప్రతి నిత్యం ట్రాఫిక్ ఆగిపోయి జనం నానాపాట్లు పడ్డారు. ప్రతినిత్యం ముఖ్య రోడ్లపై ట్రాఫిక్ నడతను పరిశీలించక పోతే ఎలా?

తగ్గిన డ్రాగన్ ఫ్రూట్

నెల్లూరు పండ్ల మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్ ధరలు ఒక్కసారిగా తగ్గాయి. ఎరుపు రకం డ్రాగన్ ఫ్రూట్ కిలో 200 రూపాయలు అమ్మేవారు. ప్రస్తుతం వంద రూపాయలుగానే అమ్ముతున్నారు. దిగుమతి ఎక్కువ కావడమే దీనికి కారణమని తెలిసింది.

చందా చెల్లించడం చాలా సులభం

జమీన్‌రైతు వారపత్రిక సంవత్సర చందా ఇక నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటియం ద్వారా సులభంగా చెల్లించవచ్చు. వాట్సప్‌లో చిరునామా పంపితే, పత్రిక నేరుగా మీ ఇంటికే వస్తుంది.

9848966163

PhonePe Google Pay Paytm

జీవిత చందా రూ.10,000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.500/-

విదేశాలకు (USD) $100

విడి ప్రతి : రు.10.00లు

చందాను ఎం.ఓ/డి.డి లేదా ఆన్‌లైన్‌లో కూడా యూనియన్ బ్యాంక్, బి.వి. నగర్ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423 (IFSC: UBIN 0815373)లో ZAMINRYOT పేరుతో జమ చేయవచ్చు.

ప్రకటనలకు

98489 66163

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

E-mail : zaminryot1930@gmail.com

జామకాయలు @ 75

పక్షం రోజులుగా నెల్లూరులోని పండ్ల మార్కెట్‌లో నాటు జామకాయలు అమ్ముతున్నారు. కిలో 75 రూపాయల ధర పలుకుతున్న ఈ జామకాయలు బాగున్నాయి.

డెంగ్యూ జ్వరాలు

నెల్లూరులో డెంగ్యూ జ్వరాన్ని తెచ్చే టైగర్ దోమలు వచ్చి తిష్ట వేశాయి. దీంతో నగరంలో వందల సంఖ్యలో డెంగ్యూ జ్వర బాధితులు ఎక్కువయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ ఈ విషయంలో స్పందించి దోమలు నిర్మూలన బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

చెత్తలో రికార్డు

నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద ఇటీవల జరిగిన రొట్టెల పండుగకు వచ్చిన భక్తులే కాదు వారు వేసిన చెత్త రికార్డు సృష్టించింది. పండుగ జరిగిన వరుస ఐదు రోజుల్లో కార్పొరేషన్ ఆరోగ్య విభాగం వంద టన్నుల చెత్త ఎత్తి డంపింగ్ యార్డులకు తరలించింది. దీని తరలింపుకు వందల మంది కార్పొరేషన్ సాధారణ పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రైవేటు పారిశుద్ధ్య కార్మికులను వినియోగించారు.

బిజెపి జిల్లా ఇన్‌ఛార్జి

బిజెపి జిల్లా ఇన్‌ఛార్జిగా భీమినేని చంద్రశేఖర్ నియమితులయ్యారు.

మినీ బైపాస్‌లోను మంచి వ్యాపారం

నెల్లూరు ట్రంకురోడ్డు మాదిరిగానే మినీ బైపాసు రోడ్డులోని టిడిపి ఆఫీసు, బెజవాడ గోపాలరెడ్డి విగ్రహం, అన్న మయ్య విగ్రహం, వనంతోపు, భక్తవత్సల నగర్, ఆర్టీఓ ఆఫీసు సెంటర్‌లలో మంచి వ్యాపారం జరుగుతుంది. అన్నీ రకాల వ్యాపార సముదాయాలు ఇక్కడ ఏర్పాటయ్యాయి.

ఇబ్బందికరంగా మ్యాన్‌హోళ్లు

నెల్లూరు పొదలకూరు రోడ్డులోని పద్మావతి సెంటర్ నేతాజీనగర్ ఏడో వీధిలో రోడ్డుపై మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు కంటే ఎత్తుగా ఉండడంతో వాహనదారులు రాత్రిళ్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

మూలాపేటలో గుంటలు

నెల్లూరు మూలాపేట మెయిన్ రోడ్డులో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టారు. ఏడాది క్రితం వేసిన తారురోడ్డును కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా త్రవ్వేశారు. సగం దూరం మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకొన్నారు. రోడ్డు గుంటలుగా మారి ప్రమాదకరంగా మారింది. రాత్రి పూట కనిపించక ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నారు.

చెత్తతో ఇబ్బంది

నెల్లూరు నగరంలోని మన్సూర్ నగర్‌లో చెత్త పేరుకు పోయి దుర్వాసన వస్తోంది. ఇంటింటి చెత్త సేకరణకు అద్దె ట్రాక్టర్లు సరిగా రాకపోవడంతో స్థానికులు చెత్తను తీసుకొచ్చి వీధుల్లో వేస్తున్నారు. ప్రతి రోజూ తొలగించక దుర్గంధం వస్తోంది. ఇలా అయితే ఎలా?

సెంట్రల్ జైలులో పరీక్షలు

నెల్లూరు సెంట్రల్ జైలులో హ్యాండ్ హోల్డ్ ఎక్స్‌రే మిషన్ ద్వారా ఖైదీలకు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. టిబీ నివారణ అధికారి ఖాదర్‌వలీ నేతృత్వంలో ఈ పరీక్షలు జరిగాయి.

ఫ్యాన్ వితరణ

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానానికి భక్తుడు చింతం రాజేష్‌రెడ్డి జెయింట్ కూలర్ ఫ్యాన్‌ను వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా దాతను సత్కరించారు. భక్తుల రద్దీ సమయంలో జెయింట్ కూలర్ ఫ్యాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఇఓ చెప్పారు.

ధైర్యంగా ఎదుర్కోవాలి

విద్యార్థులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని నెల్లూరు మూలాపేటలోని దేవిరెడ్డి శారద ప్రభుత్వ బాలికల హైస్కూల్ హెడ్మాస్టర్ పద్మావతి సూచించారు. ఐసిపిఎస్, సఖి వన్‌స్టాప్ ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే మహిళా హెల్ప్‌లైన్ 181, 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 14416 తదితర ఫోన్ నెంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సోమశిలలో చేపల వేట నిలుపుదల

రెండు నెలల పాటు సోమశిల ప్రాజెక్ట్‌లో చేపల వేటకు విరామం ప్రకటించారు. అక్రమంగా జాలర్లు వేట సాగిస్తే చర్యలు తీసుకొంటామని మత్స్య శాఖాధికారులు చెప్పారు. ప్రస్తుతం చేపలు గుడ్డు దశలో ఉన్నాయి.

చికెన్ కిలో రూ.341

నెల్లూరు మాంసం మార్కెట్‌లో కిలో కోడిమాంసం 341 రూపాయలుగా అమ్ముతున్నారు. ఈ స్థాయి ధరకు ఇటీవల కాలంలో చికెన్ చేరలేదు.

క్రిస్ సిటీ పనుల పరిశీలన

కోట, చిల్లకూరు మండలాల పరిధిలో మొదటి దశలో సుమారు 2,600 ఎకరాల్లో రూ.1,174 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రిస్ సిటీ నిర్మాణానికి మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎపి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ పేర్కొన్నారు. కోట మండలం కొత్తపట్నంలో క్రిస్‌సిటీకి సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం భూముల వివరాలు సేకరించారు. గూడూరు ఆర్డీఓ అరుణకుమారి, కోట, చిల్లకూరు తహశీల్దార్లు జయజయరావు, గోపినాధ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జడ్ఎంతో కలసి సమీక్షించారు.

సంస్మృతి

మా అమ్మ

తూపిలి రమణమ్మ

జమీన్‌రైతు మేనేజింగ్ ఎడిటర్

స్వర్గీయ తూపిలి పార్థసారథిగారి భార్య

30.7.92

వనమాలి, పేశల

పేరుకపోయిన చెత్త

నెల్లూరు మినీ బైపాస్ రోడ్డులోని శ్రీహరినగర్ ఐదవ వీధిలో రహదారి ప్రక్కనే చెత్త పేరుక పోయి డంపింగ్ యార్డును తలపిస్తుంది. గాలికి ప్లాస్టిక్ కవర్లు ఎగిరి ఇళ్లలోనికి పడుతున్నాయని స్థానికులు లబోదిమంటున్నారు.

మెడలో గొలుసు అపహరణ

వేరుశనగపప్పు కోసం వచ్చి మహిళ మెడలో గొలుసు అపహరించిన ఘటన నెల్లూరు వేదాయపాళెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు కొత్తూరులో వుంటున్న సురేఖ స్థానికంగా ప్రొవిజన్స్, ఫ్యాన్సీ దుకాణం నడుపుతున్నారు. ఇద్దరు వ్యక్తులు రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చారు. ఒకరు బైక్‌పై వుండగా, మరొ

కొరవ 14వ పేజీలో

FLAT FOR SALE

నెల్లూరు, బి.వి.నగర్ నుంచి కొండాయపాళెం వెళ్లే మెయిన్ రోడ్ నుడా పార్క్ ప్రక్కన హిందూజ అపార్ట్‌మెంట్ ప్లాట్ నెం.408 (డబుల్ బెడ్ రూం ప్లాట్), కార్ పార్కింగ్‌తో అమ్మబడును.

సంప్రదించండి:

98400 38680

98489 66163

బంగారం - వజ్రం - వెండి ఆభరణాల నిలయం

BIS 916 HUID హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై* అతి తక్కువ తరుగు

డైమండ్స్* (IGI సర్టిఫైడ్) ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ అతి తక్కువ ధరలో

సాధారణ వెండి వస్తువులపై* తరుగు లేదు, కూలి లేదు.

నెలసరి గోల్డ్ బెనిఫిట్ స్కీమ్ అవకాశం కలదు.

925 SILVER* STOCKIST

*T&C Apply

గోల్డ్ ప్యాలెస్

TRUSTED SINCE 1965

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, పాత జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.

ఫోన్: 2331133, 2327611

● నెల్లూరు

కార్పొరేషన్‌లో నిధుల దోపిడీ

చేసిన పనులు మళ్లీ చేస్తూ నిధుల మేత

నెల్లూరు నగర పాలక సంస్థలో నిధుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అభివృద్ధి పేరుతో నిధులను పలురకాలుగా దోచుకుంటున్నారు. అధికార పార్టీ ధన దాహానికి కోట్ల రూపాయల ప్రజాధనం ఆవిరైపోతోంది. కార్పొరేషన్ అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై మంత్రిని సైతం పక్కదోవ పట్టించి నిధుల దోపిడీకి పాల్పడుతున్నారు.

వాస్తవాలివిగో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలుత రోడ్ల మరమ్మత్తులకు ప్రాధాన్యత ఇచ్చింది. రోడ్ల మరమ్మత్తులకు నియోజకవర్గానికి రూ.కోటి మంజూరు చేశారు. ఆ క్రమంలో నెల్లూరు నగర నియోజకవర్గానికి కూడా రూ.కోటి మంజూరైంది. ఆ నిధులతో రోడ్లను మరమ్మత్తులు చేసినట్లు లెక్కలు చూపి తలా కాస్త పంచుకున్నారు. ఇందులో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు కీలక పాత్ర పోషించారు.

ఎండ్‌టుఎండ్ రోడ్ల పేరుతో రూ.కోట్లు ఖర్చు పెట్టారు. నగరమంతా ఎండ్ టు ఎండ్ రోడ్లను వేసినట్లు అధికారులు చెబుతున్నారు. వర్షం కురిస్తే నేరుగా వర్షపునీరు కాలువల్లోకి చేరాలని మంత్రి నారాయణ ఆదేశం. మంత్రి ఆలోచనలకు అనుగుణంగా నగరమంతా ఎండ్ టు ఎండ్ రోడ్లను వేయడం ప్రారంభించారు. ఎండ్ టు ఎండ్ పేరుతో కాంట్రాక్టర్లు రూ.కోట్లలో దోచుకున్నారు. కాంట్రాక్టర్లు అంటే అధికార పార్టీ నాయకులే..

ఎండ్ టు ఎండ్ రోడ్లు వేసిన తర్వాత సిమెంటు రోడ్డును పగుల కొట్టి మొక్కలు వేశారు. సిమెంటు రోడ్లపై మొక్కలు వేసేందుకు రూ.కోట్లలో ఖర్చు పెట్టారు. ఎండ్ టు ఎండ్ రోడ్లు వేసే సమయంలోనే రోడ్డు పక్కన మొక్కలు వేసేందుకు పాదులు చేయవచ్చు కదా.. అని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదొక దోపిడీ..

తాజాగా వేసిన రోడ్లను పగుల కొట్టి ఇప్పుడు కాలువల నిర్మాణం చేపట్టారు. నగరంలోని 14వ డివిజన్‌లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. డివిజన్‌లోని ఏసినగర్ ప్రాంతంలో ఎండ్ టు ఎండ్ రోడ్లను వేశారు. తర్వాత మొక్కలు వేసేందుకు అని రోడ్లను పగులకొట్టి మొక్కలు వేసి ట్రీగార్డులు అమర్చారు. ఇప్పుడు కాలువ నిర్మాణం పేరు చెప్పి వేసిన రోడ్డు అంచులు పగుల కొట్టారు. రోడ్డును పగులకొట్టేందుకు జెసిబి వాడుతున్నారు. జెసిబి సాయంతో పగుల కొట్టడంతో ట్రీగార్డులు కూడా దెబ్బతిని పోయాయి. ఇలా ఎందుకు చేస్తున్నారో అడిగేవారు లేరు. రూ.కోట్ల ప్రజాధనం ఈ విధంగా లూటీ చేస్తున్నారు. మంత్రి నారాయణకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపేందుకు సమయం ఉండదు. దానివల్ల కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా నిధుల దోపిడీకి పాల్పడుతున్నారు.

వారిదే దోపిడీ..

నిధులు దోపిడీకి పాల్పడుతున్న వారిలో ఎక్కువమంది కార్పొరేటర్లున్నారు. వారంతా వైసిపి నుంచి టిడిపిలోకి వలస వచ్చిన వారే.. కార్పొరేటర్లే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి దోపిడీ పర్వాన్ని కొన సాగిస్తున్నారు. దోపిడీ చేస్తున్న వారంతా తెలుగు దేశం ముసుగు కప్పుకున్న వైసిపి నేతలే కావడం గమనార్హం. అక్కడ వారిదే దోపిడీ.. ఇక్కడా వారిదేనా అంటూ ఎన్ని కష్టాలు వచ్చినా తెలుగుదేశం జెండా వదలని నాయకులు సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. మంత్రి నారాయణకు ఈ దోపిడీ అర్థమవుతుందో.. లేదో..మరి..

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కలెక్టర్ హిమాన్ష్ శుక్లా

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని కలెక్టర్ హిమాన్ష్‌శుక్లా తెలిపారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు తరలివచ్చి తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ విజయకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● రాత్రిపూట

జనన, మరణ సర్టిఫికేట్లు

కార్పొరేషన్‌లో అర్ధరాత్రి అవినీతి

నెల్లూరు కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగానికి అనుబంధంగా ఉన్న జనన, మరణాల నమోదు విభాగంలో ప్రయివేట్ వ్యక్తులు తిష్ట వేశారు. కాసులు కురిపించే సర్టిఫికెట్లను రాత్రిపూట వచ్చి మంజూరు చేసి వెళ్తున్నారు. సాధారణంగా దరఖాస్తు చేసుకున్న వారిని వారాలు, నెలల తరబడి వేధిస్తున్నారు.

అనధికారికంగా ఎంహెచ్ఓ లాగిన్ వినియోగం..

జనన, మరణాల సర్టిఫికెట్‌ను ఎంహెచ్ఓ లాగిన్ నుంచి మంజూరు చేయాలి. ఎంహెచ్ఓ సమక్షంలోనే లాగిన్ ఓపెన్ చేసి దరఖాస్తులను ఆయన పరిశీలించిన తర్వాతే సర్టిఫికెట్లు మంజూరు చేయాలి. అయితే ఎంహెచ్ఓ లాగిన్ అనధికార వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. కొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆయన ఈ సర్టిఫికెట్ల మంజూరుకు నియమించుకున్నట్లు తెలిసింది. వారు వారికి ఇష్టమొచ్చిన సమయంలో వచ్చి కార్యాలయం తాళాలు తీసుకుని ఎంహెచ్ఓ లాగిన్ ఉపయోగించి సర్టిఫికెట్లు మంజూరు చేసి వెళ్తున్నారు. ఇటీవల ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాత్రిపూట జనన,మరణాల విభాగానికి వచ్చి సర్టిఫికెట్లు మంజూరు చేసి వెళ్లారు. ఎంహెచ్ఓ తన బాధ్యతను విస్మరించి పూర్తిగా అనధికార వ్యక్తుల చేతికి లాగిన్ ఇచ్చేయడంతో అక్రమాలు జరిగే అవకాశం ఉంది. బాధ్యతాయుతమైన అధికారి పూర్తిగా ప్రయివేట్ వ్యక్తుల చేతిలో చిక్కిపోవడం శోచనీయం. ఇదిలా ఉండగా ఇద్దరు ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులు కూడా ఇటీవల రాత్రిపూట జనన, మరణాల విభాగానికి వచ్చి సర్టిఫికెట్లు మంజూరు చేసి వెళ్లినట్లు తెలిసింది. వారిద్దరు తరచూ జనన, మరణాల విభాగానికి వస్తూ సర్టిఫికెట్లు చేసుకుని వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ మహిళా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గతంలో జనన, మరణాల విభాగంలో పనిచేసిన వారే. అయితే వారిపై ఆరోపణలు రావడంతో వారిని అక్కడి నుంచి సాగనంపారు. ప్రస్తుతం ఉన్న ఎంహెచ్ఓ చొరవతో ఆరోపణలున్న వారిద్దరు మళ్లీ ఆ విభాగానికి వచ్చి హల్‌చల్ చేస్తున్నారు. ఎంహెచ్ఓ లాగిన్ ఎంతమంది ఉపయోగిస్తున్నారో.. ఎవరెవరు వాడుతున్నారో నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

జనసేన నాయకుడి జన్మదినం

ఘనంగా చేశారు

నెల్లూరుకు చెందిన జనసేన డాక్టర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి తిరుమల జన్మదిన వేడుకలు నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. నగరంలోని పేదలకు అన్నదానం చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పొగతోటలో ఉన్న విజయశ్రీబ్లడ్ బ్యాంక్‌లో భారీ కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లక్ష్మీమల్లేశ్వరరావు, పి.కిరణ్, జనసేన కో ఆర్డినేటర్ కోలా విజయలక్ష్మి, హైమావతి, మల్లిక, నరేష్, పామూరి కృష్ణయ్య, జనకుల వెంకటేశ్వర్లు, సురేష్‌రెడ్డి, సుధాకర్, శ్రీమంత్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ఎనర్జీతో కరెంటు బిల్లు నుండి విముక్తి!

ప్రతి ఇంటికి సోలార్ ప్యానెల్స్ బిగించుకోవడం వల్ల కరెంటు బిల్లు నుంచి విముక్తి కలుగుతుందని భారత్ సోలార్ ఎనర్జీ నిర్వాహకుడు ఏటుకూరి సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన ఓక ప్రకటన విడుదల చేశారు. సోలార్ ఎనర్జీ ఉపయోగించడం వలన కరెంటు బిల్లు కట్టాల్సిన అవసరం ఉండదన్నారు. సోలార్ ప్యానెల్స్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గృహ అవసరాలకు పోను మిగులు విద్యుత్‌ను ఎపిఎస్‌పిడిసిఎల్ కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే బ్యాంకులు రుణాలు, ప్రభుత్వం సబ్సిడీ కూడా లభిస్తాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన రుణాన్ని నెలవారీ వాయిదాలతో చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు. తమ వద్ద ప్రముఖ కంపెనీలైన టాటా, రేజోన్, పారీ కంపెనీల సోలార్ ప్యానెల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 30 సంవత్సరాల వారంటీ లభిస్తుందని తెలిపారు. సొంతిల్లు ఉన్న వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టాలు

సోమిరెడ్డి అందజేత

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం నడుం బిగించింది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్‌స్టవ్‌లు మంజూరు చేసింది. సర్వేపల్లి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఇండక్షన్ స్టవ్‌లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని పొదలకూరు మండలం అమ్మవారిపాళెంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇండక్షన్ స్టవ్‌లను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇండక్షన్‌స్టవ్‌లు వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని సోమిరెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు పాల్గొన్నారు.

నీట్‌లో విశ్వసాయి ప్రభంజనం

ఇటీవల విడుదలైన జాతీయస్థాయి నీట్ – 2026 ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి మెడికల్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. విశ్వసాయి కళాశాలకు చెందిన 80మందికి పైగా విద్యార్థులు ఎంబిబిఎస్, బిడిఎస్‌లో చేరేందుకు అర్హత సాధించారని కళాశాల చైర్మన్ ఎన్.సత్యన్నారాయణ తెలిపారు. డి.ఉష (510మార్కులు), కె.గీతిక హాసిని (506మార్కులు), ఆర్.ప్రశాంతి (505మార్కులు), ఆర్.స్నేహశ్రీ(494మార్కులు) అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. ఎంబిబిఎస్, బిడిఎస్‌లో చేరేందుకు అర్హత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌చైర్మన్ కృష్ణ మోహన్, కళాశాల డైరెక్టర్ శివసంకేత్ తదితరులు పాల్గొన్నారు.

● నీట్‌లో

డాక్టర్ కిషోర్‌రత్నం కాలేజి విద్యార్థుల ప్రతిభ

ప్రతి ముగ్గురిలో ఒకరికి సీటు

ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో నెల్లూరులోని డాక్టర్ కిషోర్ రత్నం కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఆలిండియా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. టి.లాస్యశ్రీ (523 మార్కులు), డి.దామిని(522 మార్కులు), ఎన్.ధీరజ్(496 మార్కులు), బి.రాజేశ్వరి (475 మార్కులు), కిరణ్మయి(465 మార్కులు), మధుశ్రీ (463 మార్కులు), ఎన్.వైష్ణవి(452 మార్కులు), ఎం.కృప(448 మార్కులు), ఎ.వెంకటసాయి ప్రణీత (440 మార్కులు), ఆర్.కార్తీక మాధురీ సింగ్ (438 మార్కులు), టి.రితికా షెరల్ (435 మార్కులు), షేక్.మన్వఫలాక్ (424మార్కులు), బి.రీనా ఎంజల్ (423 మార్కులు) టి.భావన (420) మార్కులు సాధించి వివిధ కేటగిరిలలో డాక్టర్ సీట్లను కైవశం చేసుకున్నారు. ప్రతి ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు డాక్టర్ సీటు సాధించినట్లు కళాశాల బాధ్యులు తెలిపారు. నీట్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను డాక్టర్ కిషోర్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు కృష్ణ కిషోర్, వాసంతి కిషోర్ అభినందించారు. అద్భుతమైన విజయాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ కిషోర్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నీట్ అకడమిక్ హెడ్ రఘుపతినాయుడు, అకడమిక్ అడ్వైజర్ గురవయ్య నాయుడు, ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన జిల్లా అధ్యక్షుడి రేసులో ముగ్గురు...

త్వరలో నియోజకవర్గాలకు ఇన్‌చార్జులు

స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ఈ మేరకు చర్యలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో జిల్లా జనసేనకు కార్యవర్గాలు ఏర్పాటు చేసేందుకు ఆ పార్టీ అధిష్టానం అడుగులు వేస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కావాలంటే జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి కమిటీలు ఉండాలని పార్టీ అధిష్టానం గుర్తించింది. దీంతో ఆ దిశగా చర్యలు ప్రారంభించింది.

దరఖాస్తులు స్వీకరించారు..

జిల్లా, నియోజకవర్గాల బాధ్యులను ఎంపిక చేసేందుకు ఇటీవల నెల్లూరులో జనసేన కేంద్ర నాయకులు దరఖాస్తులు స్వీకరించారు. సుమారు వారం రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సాగింది. వివిధ హోదాల్లో పనిచేసేందుకు ఉత్సాహం చూపే వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పరిశీలకులుగా వ్యవహరించారు.

జిల్లా అధ్యక్షుడికి ముగ్గురు పేర్లు పరిశీలన

పార్టీ ఆవిర్భావం నుంచి జిల్లాలో ఒకసారి మాత్రమే కమిటీలు వేశారు. వారే వివిధ హోదాల్లో కొనసాగుతూ వస్తున్నారు. స్వయంప్రకటిత నాయకులు పార్టీని తమ సొంత అవసరాలకు వాడుకుని వివిధ అక్రమాలకు పాల్పడ్డారు. దాంతో పార్టీ అధిష్టానం పాత కమిటీలను పూర్తిగా రద్దు చేసింది. రద్దు అనంతరం కమిటీలు వేసేందుకు వడివడిగా అడుగులు వేయడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లా అధ్యక్షుడి పదవికి వంద మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. వారిలో ముగ్గురు పేర్లను జిల్లా అధ్యక్షుడిగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ముగ్గురు ప్రముఖులే.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

కోటంరెడ్డు కలసి చేశారు

నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం సమీపాన ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డులో ఎన్టీఆర్ కాంశ్య విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు, గణేష్‌ఘాట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి సహకారంతో గణేష్‌ఘాట్ వద్ద ఆర్చీల నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు తరహాలో నెల్లూరులో నెక్లెస్ రోడ్డును అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కో క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఆత్మకూరులో మంత్రి రామనారాయణరెడ్డి

ఆత్మకూరు పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నడుం బిగించినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడారు. ఆత్మకూరులో తాగునీటి ఇబ్బందులు సృష్టించేందుకు కొందరు ఉద్దేశ్యపూర్వకంగా పైప్‌లైన్ ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైప్‌లైన్ ధ్వంసం చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారని మంత్రి తెలిపారు. రూ.89లక్షలు వెచ్చించి తాత్కాలిక మరమ్మత్తులు చేసి పైప్‌లైన్ పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.20కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆత్మకూరు పట్టణంలో రూ.75 నుంచి రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆత్మకూరు అభివృద్ధిని అడ్డుకోలేరని అన్నారు. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సమావేశంలో ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్, పలు శాఖల అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రహసనంలా సర్ ప్రక్రియ

- చనిపోయిన వారూ ఓటర్లు
- జిల్లాలోనే ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో ఓటు
- ఇదా పారదర్శకత

జిల్లాలో సర్(ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ఒక ప్రహసనంలా సాగింది. కాకి లెక్కలతో సర్ ప్రక్రియను ముగించేశారు. వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చినట్లు, ఓటర్ల నుంచి ఫారాలు తిరిగి తీసుకుని డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు ఈనెల 16వ తేదీన ప్రకటన విడుదల చేశారు. వంద శాతం డిజిటలైజేషన్ పూర్తిచేసినట్లు నియోజక వర్గాల వారీగా వివరాలు విడుదల చేశారు. అధికారులు విడుదల చేసిన లెక్కలలో సర్ ప్రక్రియలోని డొల్లతనం బయటపడుతోంది.

నిర్లక్ష్యంగా బిఎల్ఒలు

బిఎల్ఒలు నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వలేదు. వారిపై అధికారుల పర్యవేక్షణ కరువవడంతో ఈ పరిస్థితి నెలకొంది. బిఎల్ఒలుగా సచివాలయాల ఉద్యోగులను నియమించారు. వారిలో ఎక్కువశాతం ప్రతిపక్షపార్టీకి తాబేదార్లుగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. నెలరోజులపాటు సాగిన సర్ ప్రక్రియలో ప్రతిరోజూ సాయంత్రానికి దొంగ లెక్కలు ఇచ్చేసి చేతులు దులుపుకొన్నారు. పై అధికారులు కూడా వారు ఇచ్చిన సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు ఇచ్చారు.

ఒక్కరు కూడా మరణించలేదా?

వందశాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఎవరైనా ఓటరు చనిపోయి ఉంటే వారింట్లో ఉండేవారికి మృతుడు పేరిట ఉన్న ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వరు. దీనివల్ల మృతుల వివరాలు కూడా తేలే అవకాశం ఉంది. అయితే సర్ ప్రక్రియలో చనిపోయిన వారికి కూడా ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చినట్లు భావించాల్సి వస్తోంది. నెల్లూరుజిల్లాలో 2024 తర్వాత ఒక్క ఓటరు కూడా మరణించలేదా అనే ప్రశ్న వినిపిస్తోంది. కొందరు ఓటర్లకు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోనూ ఓటున్నాయి. సర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తే ఈ వ్యవహారంలో డొల్లతనం బయటపడే అవకాశం ఉంది.

- పల్లెవీక్షణం

అర్జీలను నెల రోజుల్లో పరిష్కరిస్తాం

కలెక్టర్ హామీ

పల్లె వీక్షణం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నెలరోజుల్లో పరిష్కారం చూపుతామని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం పులికల్లులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పల్లె వీక్షణం కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే, కలెక్టర్ గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామ సమీపాన జరుగున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మమేకమయ్యారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు నేరుగా తమ సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం

గ్రామస్తులు కొన్ని సమస్యలను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. పశు సంరక్షణ కోసం మినీ గోకులాలు మంజూరు చేయాలని రైతులు కోరగా వెంటనే పది మినీ గోకులాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరు చేశారు. గ్రామంలో ప్రతివారం 104 సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డిఎంఅండ్‌హెచ్ఒను ఆదేశించారు. గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే విషయాన్ని పల్లెవీక్షణం ద్వారా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్‌రెడ్డి, డ్వామా డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, ఐసిడిఎస్ పిడి హేనాసుజన్, పశుసంవర్ధకశాఖ జేడి రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టండి

నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్

వర్షపు నీటిని ఒడిసి పడితేనే భవిష్యత్తు ఉంటుందని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు. ఆయన ఆ ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. వర్షపు నీరు వృథాకాకుండా భూమిలోనే ఇంకిపోయే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. నీటి కొరతను నివారించి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. నూతనంగా నిర్మించే భవనాల్లో రెయిన్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అన్నారు. వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకునేందుకు మరింత సమాచారం కోసం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

నెల్లూరులో సిడిఎంఎ పర్యటన

కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్‌కుమార్ ఇటీవల నెల్లూరు నగరంలో పర్యటించారు. నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను కమిషనర్ నందన్‌తో కలిసి పరిశీలించారు. నగరంలోని జాకీర్‌హుస్సేన్‌నగర్ ప్రాంతంలోని స్మార్ట్ స్ట్రీట్ బజార్ నిర్వహణ తీరును ఆయన తనిఖీ చేశారు. వినియోగదారుల కోసం అందుబాటులో ఉన్న తాగునీటి వసతి, మరుగుదొడ్లు, షాపుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం దొంతాలి డంపింగ్‌యార్డును వ్యర్థాల రీసైక్లింగ్ ప్రక్రియను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అదేవిధంగా నగరంలో జరుగుతున్న పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులున్నారు.

ఎన్ఎస్‌టీఎఫ్‌డిసి ప్రాజెక్ట్‌కు తూట్లు

గిరిజనులకు అందని రుణాలు

గిరిజన యువతకు ఉపాధితో పాటు ఆర్థిక తోడ్పాటును అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ షెడ్యూల్డ్ ట్రైబల్స్ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌టీఎఫ్‌డిసి) గత కొన్ని సంవత్సరాలుగా ఐటిడిఏలకు ఎటువంటి నిధులు మంజూరు చేయడం లేదు. గతంలో ఐటిడిఏ పరిధిలో వుండే ట్రైకార్‌తో కలిపి గిరిజన యువతకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించారు. 2014–19 సంవత్సరాల్లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో రెండు విడతలో ఇన్నోవా, బొలేరో వాహనాలను లబ్దిదారులకు రాయితీపై అందించడం జరిగింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పర్యవేక్షణ సరిగాలేక క్షేత్రస్థాయిలో ప్రగతి మందగించింది. దీని ఫలితంగా కొత్త ప్రాజెక్టులు అమలు చేసేందుకు కేంద్రం ఒక్కపైసా నిధులు విదల్చక పోవడం గమనార్హం. ఎన్ఎస్‌టి ఎఫ్‌డిసి రుణాల కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న గిరిజన యువతకు నిరాశే మిగులుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టిసారించి ఎన్ఎస్‌టిఎఫ్‌డిసి పథకాన్ని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బినామీలదే హవా..

2016–17ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్‌టి ఎఫ్‌డిసి–ట్రైకార్ సంయుక్తంగా లబ్దిదారులకు వాహనాలను రాయితీపై తక్కువ వడ్డీకి అందజేశారు. వాహన ధరలో 10శాతం లబ్దిదారుడు తన వాటాగా చెల్లించాల్సి వుంది. మిగులు మొత్తం కార్పొరేషన్ రుణంగా అందించింది. తీసుకున్న రుణాలను సులభ వాయిదా పద్ధతుల్లో ఎటువంటి ఒత్తిడి లేకుండా తిరిగి చెల్లించాల్సి వుంటుంది. ఈ పథకం అమలు చేయడంలో రాజకీయ జోక్యం, అసలైన లబ్దిదారులకు లబ్ది చేకూరలేదనే అప్పట్లో విమర్శలు వచ్చాయి. బినామీలు అధికంగా వుండటంతో తిరిగి చెల్లింపుల శాతం పూర్తిగా పడిపోయింది. సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఒక్క లబ్దిదారుడు కూడా తాను తీసుకున్న రుణం పూర్తిగా కట్టకపోవడం గమనార్హం. ఇప్పటికే అమలులో వున్న ప్రాజెక్టు పురోగతి ఆశాజనకంగా లేకపోవడంతో కొత్త ప్రాజెక్టు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని అధికారులు చెబుతున్నారు.

గ్రామ పంచాయతీల్లో వేతనాలు లేవు

ఇబ్బందిపడుతున్న పారిశుద్ధ్య కార్మికులు

గ్రామాలను పరిశుభ్రంగా వుంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వేతనాలందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి పంచాయతీ అధికారులు వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో వెయ్యి మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ అరకొర జీతాలే అందుకుంటున్నా అవి కూడా సమయానికి రాకపోవడంతో అతికష్టం మీద కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఈ సంవత్సరం మార్చిలో గ్రామ పంచాయతీల పాలకవర్గం గడువు ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. సర్పంచులు తమ పదవీ కాలంలో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను ఎలాగొలా నెట్టుకొచ్చేవారు. కానీ ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీల్లో నిధుల వినియోగంపై ఆంక్షలు వుండడంతో వేతనాలు అందించడం కొంత మేరకు కష్టతరంగా మారింది. దీంతో ప్రస్తుతం పంచాయతీ కార్మికులకు వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయని చెబుతున్నారు. కొన్ని చిన్న గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులే చొరవ తీసుకుని పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నట్లు సమాచారం. కానీ పెద్ద పంచాయతీల్లో ఎక్కువ మంది పనిచేసే దగ్గర అలా కుదరకపోవడంతో వేతనాలు రాక కార్మికులు అప్పు చేసి కుటుంబాలను పోషించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులకు స్మార్ట్ కార్డులు

తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుకొనే అవకాశం

గురుకులాలు, కళాశాల, సంక్షేమ వసతి గృహాల్లో వుంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు అధికారులు స్మార్ట్ కార్డులు అందజేస్తున్నారు. విద్యార్థినులు తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం స్మార్ట్‌కార్డులు మంజూరు చేసింది. ఇప్పటివరకు విద్యార్థినులు తల్లిదండ్రులతో మాట్లాడుకునే అవకాశం లేదు. ఉపాధ్యాయులకు విజ్ఞప్తిచేసి వారి ఫోన్ల నుంచి తల్లిదండ్రులతో మాట్లాడేవారు. గురుకులాలు, హాస్టళ్లలో చేరిన విద్యార్థుల్లో చాలామంది ఇంటిమీద బెంగతో మానసికంగా ఇబ్బందులు పడుతుండేవారు. కొందరు హాస్టళ్లలో సర్దుబాటు కాలేక పారిపోయిన ఉదంతాలెన్నో వున్నాయి. ఉపాధ్యాయులు, వార్డెన్లు వారిని వెతికి పట్టుకుని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించేవారు. ఈ పరిస్థితులను పూర్తిగా నివారించేందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ అధికారులు వసతి గృహాల్లో స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టారు. విద్యార్థి పేరుతో స్మార్ట్ కార్డు జారీచేస్తారు. రూ.150 టాక్‌టైమ్‌తో విద్యార్థులు రీఛార్జి చేసుకోవాల్సి వుంటుంది. నిర్దేశిత టాక్‌టైమ్ ముగిశాక మళ్లీ రీఛార్జి చేసుకోవచ్చు. ప్రతి వంద మంది విద్యార్థులకు ఒక ఫోన్ బాక్స్ కేటాయిస్తారు. స్మార్ట్‌కార్డును విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లతో మ్యాపింగ్ చేస్తారు. ఈ స్మార్ట్ కార్డుల నుంచి రెండు నంబర్లకు కేవలం అవుట్ గోయింగ్ కాల్స్ చేసుకునేందుకు మాత్రమే అవకాశం వుంటుందని అధికారులు చెబుతున్నారు.

డాక్టర్ ప్రసాద్‌కు లయన్స్ క్లబ్ పగ్గాలు

నెల్లూరు పినాకినీ అధ్యక్షునిగా ఎంపిక

లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని అధ్యక్షుడిగా ఆర్థోపెడిక్ డాక్టర్ ఎంఎవివి ప్రసాద్ ఎన్నికైనారు. ఇటీవల నెల్లూరు నగరంలోని రోటరీక్లబ్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని అధ్యక్షుడిగా డాక్టర్ ప్రసాద్, కార్యదర్శిగా కె.బాలాజీ, కోశాధికారిగా వి.అనిల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో కోటి రూపాయల విలువ చేసే డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే టిపి గూడూరు మండలం వీలుకానిపల్లి గ్రామంలో గోశాల నిర్వహణకు రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. మహిళల స్వయం ఉపాధి కోసం కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు, గాంధీబొమ్మ సమీపంలో వున్న స్వతంత్ర పార్కు నిర్వహణ, నెల్లూరు నగరంలో రోజుకు 150మంది పేదలకు మధ్యాహ్నం అన్నదానం లయన్స్‌క్లబ్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

శ్రీ షిర్డి సాయిబాబా
గురుపూర్ణిమ మహోత్సవములు
తేది 29-07-2026 బుధవారం నుండి 06-08-2026 గురువారం వరకు

కార్యక్రమ వివరములు:

తేది: 29-07-2026 బుధవారం నుండి తేది: 04-08-2026 మంగళవారం వరకు ప్రతి రోజు ఉ॥ 7.00 గం॥ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, మ॥12 గం.ల సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజా కార్యక్రమములలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.300/- చెల్లించి తగు రశీదు పొంది పూజా కార్యక్రమములలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించి శ్రీ బాబా వారి కృపకు పాత్రులగుదురని కోరుకుంటున్నాము.

బాబా నగరోత్సవం :

తేది: 05-08-2026 బుధవారం సా॥ 6 గంటలకు పుష్పాలంకరణలతో మంగళ వాయిద్యములతో, విద్యుత్ దీప కాంతులతో, బాణ సంచా వేడుకలతో శ్రీ షిర్డి సాయిబాబా మందిరం నుండి గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్, ఏ.సి.సెంటర్, సంతపేట మండపము, చిన్నబజార్, పెద్ద బజార్, బారకాసు, వి.ఆర్.కాలేజ్ సెంటర్, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మీదుగా తిరిగి శ్రీ షిర్డి సాయిబాబా మందిరమునకు చేరును.

తేది: 06-08-2026 గురువారము మధ్యాహ్నం 12.00 గం॥లకు అన్నదాన ప్రసాదం కార్యక్రమము జరుగును.

(పై అన్నదానముకు భక్తులు తమకు తోచిన విధంగా వస్తురూపంగా గాని, ధన రూపంగా గాని చెల్లించి తగిన రశీదు పొందవలెను.)

ఇట్లు: కార్యవర్గము
శ్రీ షిర్డి సాయిబాబా మందిరము
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు.

ఉద్యోగుల గూర్చి భారతం ఏమి చెబుతుంది?

యజమాని చాలామంది ఉద్యోగులను తన అవసరాన్నిబట్టి నియోగించు కొంటాడు.

అయితే అందరికీ అన్నిరకాల పనులూ చెప్పగూడదు. వాళ్ల వాళ్ల స్థాయినిబట్టి తగిన పనులలో పెట్టాలి.

ఉత్తమ మధ్యమ అధమ భేదాలు వుంటాయి వాళ్ల వాళ్ల జన్మసంస్కారాన్ని బట్టి.

కొలువులో అన్నిరకాల పనులూ వుంటాయి. దేనికి తగిన వాణ్ణి దానికి ఏర్పాటు చేయాలి.

కొలువులో చేర్చుకొనే వారందరూ ఉపధా శుద్ధులుగానే వుంటారు. ముందే తగిన పరీక్షలు రహస్యంగా చేసి, ఆ తర్వాతే పనులు చెప్తారు. ధౌమ్యమహర్షి విరాటనగరంలో ప్రవేశించబోయే పాండవులకు ఎలా నడుచుకొనేవాడు రాజు అభి మానం చూరగొంటాడో వివరిస్తాడు.

కొలువులో చేరేవాళ్లందరూ అంతకు మునుపే రాజుకు దగ్గరైన వాళ్ల ద్వారా చేరేవాళ్లుగానే వుం టారు. ఏకై వచ్చి మేకయ్యే వాళ్లను అసలు దరిచేర నివ్వరు. చేరినవాడెపుడైన తోక ఝాడిస్తే ఆ ఉద్యో గం ఇప్పించిన వాడికే ముప్పు.

ఇప్పుడు గూడా సెక్రెటరీ లెవల్ టాక్స్ వుం టాయి. చర్చలయి పని ఎలా జరగాలో తేలిన తర్వాతే మంత్రులస్థాయి సమావేశాలు జరగడం పరిపాలనలో చూస్తూ వున్నదే.

సంజయ రాయబారం ఘట్టంలో ధర్మరాజు అంటాడు:–

ఇప్పటికీ అక్కడ ఆ కర్ణుడి పెత్తనమే జరుగు తున్నది గదా! అని.

అందుకు సంజయుడి సమాధానం చూడండి:–

"కురురాజునొద్ద అవినీతులు, నీతిమం తులు, సత్యసంపన్నులు, దురహంకారులు, మరియు వివిధ ప్రకారులు నయి బెరసియుం డుదురు.... వారినంత యనం బనిలేదు."

కొలువులో అన్ని స్థాయుల మనుషులూ అవ సరపడ్తారు.. అయితే అందరూ రాజుకు మాత్రం విధేయులుగానే వుంటారు. సాధుజనులూ వుం టారు.. రౌడీలూ వుంటారు. ఏ అవసరానికి వాళ్లు!

ఈ కర్ణుడు నా సోదరులు చెడిపోడానికి కార ణం అని పాపం ధర్మరాజు మనసులో. దానికి–

ఇలాంటి వాళ్లూ వుంటారు లే – కొలువంటే అందరూ వుండాలి గదా! అన్నట్టు మాట్లాడుతాడు సంజయుడు.

హనుమ సీతమ్మ దగ్గరకు పోయినపుడు – "సుగ్రీవుడి దగ్గర వున్న వాళ్లు అందరూ నాకంటే అన్ని విధాలా గొప్పవాళ్లే. ఈ దూతకృత్యానికి ఉత్త ములను (ఫస్ట్ కాటగిరీ వాళ్లను) పంపించరు గదా!"

అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః
న హి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతీహేతరే జనాః

(సుందర కాండ. 39–39)

అని తనను హనుమ 'ఇతర' జనులలోనే పరిగణించుకొన్నాడు..

అయితే ఏ స్థాయిలో వున్నా సేవకులు తమ ఏలిక కష్టకాలంలో ఒళ్లు దాచుకోరు.

జూదానికి ధర్మరాజును ఒక రాజుగా వున్న వాణ్ణి పిలవడానికి విదురుడి స్థాయి మంత్రి అవ సరమైనాడు. ద్రుపదుడి దగ్గర వున్న పాండవులను వెనకకు రప్పించుకోవడానికి విదురుడి అధికార స్థాయి అవసరమయింది.. శత్రువు దగ్గర పని జరుపుకోడానికి తగిన ఒప్పందం చేయడానికి మంత్రి స్థాయి అయిన విదురుడు పంపబడ్డాడు.

ద్రౌపదిని సభలోకి తీసుకొని రమ్మని విదురు డికి ఆర్డర్ వేస్తాడు సుపుత్రుడు. ఆయన ధృతరా ష్ట్రుడికే ఆమాత్రం గౌరవం చూపిస్తాడు గానీ అవా చ్యాలు కూసే కుర్రకారుకు కాదు.. ఆ పనికి ప్రాతి కామి స్థాయి సరిపోయింది.

శ్రీ కృష్ణుణ్ణి రాయబారం పంపడం ఒక విధంగా ఆయన స్థాయికి తగనిదే. అయినా ఆయనే సంజయ రాయబారంలో చివరన "నేనైనా వచ్చి చెప్పి చూస్తా..పద." నా మాట విని అయినా బాగుపడ్తారేమో! అన్నాడు గాబట్టి ధర్మరాజు చొరవ చేసుకొని – నీవే తల్లివి తండ్రివి.. నీవే మా తోడు నీడ.. అన్నట్టు విధేయత చూపిస్తూ అం దుకు తన పరివారాన్నంతటినీ కృష్ణుడి విడిదికి తరలించి దండప్రణామాదులన్నీ భక్తితో చేసి తన మనవి అక్కడ వెళ్లబోసుకొన్నాడు గానీ –

విదురుణ్ణి జూదానికి పిలుచుకొని రమ్మని



ధృతరాష్ట్రుడు సభలో ఆదేశించినట్టు (స్టాఫ్ ఆర్డర్) ఇక్కడ నడుచుకోలేదు.

శల్యుడు నన్ను కర్ణుడికి సారథ్యం చేయమం టావా?... నన్ను ఆ స్థాయికి దిగజారుస్తావా? అని ఆగ్రహం చూపుతాడు. (అయినా కృష్ణుడితో సమా నుడివౌతావు అనేసరికి ఒప్పుకొంటాడు.)

ద్రౌపది సైరంధ్రీ వృత్తిలో చేరేటప్పుడు కొన్ని అభ్యంతరాలు ముందే చెప్పి చేరుతుంది. పూలు కట్టడం, గంధాలు తీయడం వంటి పనులే తనకు చెప్పవలె. ఎంగిళ్ల జోలికి పోను. నీచకార్యాలకు నన్ను పంపగూడదు... ఒక సంవత్సరం ఇక్కడ కొలువు చేస్తాను – అని చెప్పి యజమానురాలి అంగీకారం మీదనే కొలువులో చేరుకొంటుంది.

మయసభ దర్శింపవచ్చిన నారద మహర్షి ధర్మరాజును నీవు పరిపాలనలో ఈ యీ నియ మాలు అనుసరిస్తున్నావు గదా అని యోగక్షేమ విచారణగా అన్న మాటలలోది ప్రస్తుతపద్యం.

జీతాలు సకాలంలో ఇస్తున్నావా? నెల తిరి గేటికి వాళ్ల జీతాలు వాళ్లకు ఇచ్చేయాలి. అనూన ముగా అంటే తక్కువ కాకుండా ఇస్తున్నావు గదా! అంటున్నాడు. కొరవ సరవలు పెట్టకుండా వాయి దాల్లో ఇస్తాలే అనకుండా ముందుగానే కావలసి నంత రొక్కం సిద్ధం చేసుకొని వుండాలి సుమా! అంటున్నాడు మహర్షి.

ఇక్కడ ఇంకో ముఖ్యమైన మాట గూడా చెప్పాడు:–

తమ తమ కనియెడు తరి జీ
తము గానక నవయు భటుల దౌర్గత్య విషా
దము లేలిన వాని కవ
శ్యము నెగ్గొనరించు నతడు శక్రుండైనన్.

(సభా.1–37)

ఎవరికి ఏ తేదీకి జీతం కంటబడుతుందో ఆ నాటికి అది వాళ్లకు అందకపోతే వాళ్లు పొందే కష్టం ఎంత ఇంద్రుణ్ణినా కష్టాల పాలు చేస్తుంది.

పెన్షనర్స్ విషయం గూడా ఉంది:–

అనఘా! నీ ప్రస్తవమున
నని నీల్గిన వీరభటుల అనుపోష్యుల నె
ల్లను ప్రోతె? భోజనాచ్ఛా
దనముల వారలకు నెమ్మి తరుగక యుండన్

(సభా.1–39)

ప్రశ్నలో పద్యంలో 'జీవితంబులు' అని వుం డాలి. గణభంగం ఔతుంది. అర్థం జీతము అనే. తర్వాత వచ్చే పద్యంలో 'జీతము' అనే మాట గూడా వుంది.

స్వస్తి ప్రజాభ్యః.

– డాక్టర్ మాచవోలు శివరామప్రసాద్

కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్నవారిలో పెద్ద ఎవరు?

బాహ్లికుడు – భీష్ముడి పెదనాయన అందరి కంటే పెద్దవాడు. (1.దేవాపి, 2.బాహ్లికుడు, 3.శంతనుడు – అన్నదమ్ములు. వీళ్ల తండ్రి ప్రతీ పుడు.)

ఆ తర్వాతి తరం – భీష్ముడు, బాహ్లికుడి కొడుకు సోమదత్తుడూ. తర్వాతి తరం – ద్రోణుడూ, ద్రుపదుడూ.

శంతనుడు తన పాలనా కాలంలో తనకు అరణ్యంలో దొరికిన కృపుణ్ణి, కృపుని చెల్లెలు (కవ లలు)నూ శిశువులను తన రాజ్యానికి తీసుకొని వచ్చి, ఆ నిసుగులు బ్రాహ్మణులు అని తెలిసి, ఆ వర్ణధర్మానికి అనుగుణంగా సంస్కారాలు జరిపిం చాడు. పెంచాడు.

కృపి ద్రోణుడి భార్య. కృపుడు, ఆమె కవ లలు గదా! కృపుడు – భీష్ముడి కంటే చిన్న ఏమో!

కృపిని ద్రోణుడు పరిగ్రహించడాన్నిబట్టి ఊహించవచ్చు. వయసులో చాలా పెద్ద అయిన పాండవులు ద్రౌపదిని వివాహమాడారు. శల్యుడు మాద్రికి అన్న గూడా అంత వయసులో ఆ స్వయంవరానికి వరుడుగా వచ్చాడు.

భీష్ముడు పరశురాముడి దగ్గర అస్త్రశస్త్ర విద్యలు నేర్చిన తర్వాత చాలా కాలానికి – పరశు రాముడు భూమండలమంతా కశ్యప మహర్షికి దానం ఇచ్చి వేసిన వేళలో – ద్రోణుడు ఆయన దగ్గర అస్త్రవిద్యలు నేర్చాడు. భీష్ముడి పైన ఎపుడూ సోదరగౌరవం (తన గురువు పూర్వశిష్యుడు అని) చూపేవాడు. అందుచేత గూడా భీష్ముడే ద్రోణుడి కంటే పెద్దవాడు అనుకోవచ్చు.

పురుషులు తమ కంటే చిన్నవాళ్లనే పరిణ యమాడే వాళ్లు గాబట్టి కృపి కంటే ద్రోణుడు పెద్ద వాడు. కృపుడూ ద్రోణాచార్యులకంటే చిన్నవాడే అని చెప్పవచ్చు.

నవోదయలో ఇక నవీన విద్య

ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య

కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో సిబిఎస్‌ఈ విధానంలో చదవాలనే కుతూహలం వుందా..ప్రతిభ వున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదా అయితే ఆరు నుంచి ప్లస్‌టూ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం నవోదయ విద్యాలయాలు కల్పిస్తున్నాయి. నెల్లూరు జిల్లాకు సంబంధించి నవోదయ విద్యాలయం మర్రిపాడు మండలంలో వుంది. 2027-28 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబరు 28న ప్రవేశ పరీక్ష వుంటుంది. సీటు సాధించిన విద్యార్థులు 6-12వ తరగతి వరకు ఉచిత విద్యనభ్యసిస్తారు. నవోదయలో కో-ఎడ్యుకేషన్ వుండగా బాల బాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యం వుంటుంది. క్రీడలు, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నూతన సాంకేతిక అంశాలను జోడించి విద్యాబోధన చేస్తారు. 6వ తరగతిలో ప్రవేశానికి నవోదయ విద్యాలయ సమితి నిర్వహించే ప్రవేశ పరీక్షకు విద్యార్థులు పలు అర్హతలు కలిగి వుండాలి. 2026-27 విద్యా సంవత్సరంలో నెల్లూరు జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతూ వుండాలి. 3, 4తరగతులు కూడా ఇదే పాఠశాలల్లో చదివి వుండాలి. 1-5-2015 నుంచి 31-7-2017మధ్య కాలంలో జన్మించి వుండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వుంటుంది.

మొత్తం సీట్లలో 1/3 వంతు బాలికలకు కేటాయిస్తారు. విద్యాలయంలో చదువుతో పాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ వుంటుంది. దేశభక్తి సేవాభావం అలవాటు పడేలా స్కౌట్స్, ఎన్‌సిసి నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దుతారు. ఐఐటి, ఎన్‌ఐటి, ట్రిపుల్ ఐటి వంటి విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా సన్నద్ధం చేస్తారు. నవోదయ విద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ప్రవేశానికి ఆన్‌లైన్‌లో హెచ్‌టిటిపిఎస్://సిబిఎస్‌ఈఐటిఎంఎస్.ఆర్‌సిఐఎల్.జిఓవి.ఇన్.ఎస్‌బిఎస్/వెబ్‌సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది.

అద్దె ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు

పసిగట్టలేకపోతున్న పోలీసు

నెల్లూరు నగరంలో వ్యభిచార కార్యకలాపాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. పలువురు నిర్వాహకులు అద్దె ఇళ్లల్లో గుట్టు చప్పుడు కాకుండా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన యువతులను తీసుకొచ్చి దందా నడిపిస్తున్నారు. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ముఠాలపై పోలీసు నిఘా కొరవడడంతో పాడు పనులు చేస్తూ లక్షలాది రూపాయలు గడిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో స్థానికులే వీరి ఆగడాలను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టిస్తుంటారు. అద్దె గృహాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు అధికారులు దృష్టిసారించి కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు. నెల్లూరు నగరంలో కొన్ని దశాబ్దాల కాలం నుంచి కొందరు వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో కొందరు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నెల్లూరు నగరంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీటి నిర్వాహకులు నగర శివారు ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారు. చాలామంది యజమానులు కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుంటారు. అద్దెకు తీసుకునే వారి గుర్తింపు కార్డులు, వివరాలు గానీ, వారు ఎందుకు ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారన్న కనీస సమాచారం తెలుసుకోకుండానే ఇళ్లను అద్దెకిస్తున్నారు. నిర్వాహకులు వేర్వేరు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మహిళలను ఆయా గృహాల్లో ఉంచుతుంటారు. రాత్రి సమయాల్లో వాహనాల్లో విటుల వద్దకు పంపుతుంటారు. కొందరు ఏకంగా అదే ఇళ్ల లోకి విటులను రప్పించి వారికి అన్ని సదుపాయాలు సమకూర్చి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

మొన్న స్పా సెంటర్ల ముసుగులో కొందరు అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారు. నగరంలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో స్పా సెంటర్లపై పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి యువతులను, విటులను ఆధీనంలోకి తీసుకున్నారు. పోలీసు నిఘా ఎక్కువ కావడంతో ఖరీదైన అపార్టుమెంట్లలో వ్యభిచారం సాగించేవారు. ఇప్పుడు నగర శివారు ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు.

జంగమల అభివృద్ధికి కృషి

నెల్లూరులోని వీరశైవ కళ్యాణ మండపంలో జంగమ సేవా సంఘం ఆత్మీయ సమావేశం 19తేది ఘనంగా జరిగింది. సమావేశంలో సంఘం నాయకులు పూల శీనయ్య (మూలపేట), చిన్న పిల్లల డాక్టర్ రవికుమార్, విశ్రాంత మైనింగ్ ఇన్స్‌పెక్టర్ జంగమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంధవళ్ల దశరథరామయ్య తదితరులు ప్రసంగించారు. జంగమ కులస్తుల విద్యా వైద్యపరంగా సేవలు విస్తృతం చేస్తామన్నారు. జంగమల అభివృద్ధికి కృషి చేసిన స్వర్గీయ గంగపట్నం చంద్రశేఖరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. శ్రీశైలంలో జంగమ సేవా సమితి తరఫున సత్రం నిర్మించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా వీరశైవ కళ్యాణ మండప నిర్మాణానికి 20 లక్షల రూపాయల విరాళం ఇచ్చిన డాక్టర్ రవికుమార్‌ను, దశరథ రామయ్య ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చేజర్ల రమేష్, కల్పం రమేష్, ఉద్దండి అమరలింగం, విజయదుర్గా ఆస్థాన పీఠాధిపతి వీరబ్రహ్మయ్య, గంధవళ్ల ఉమాశంకర్, ప్రసన్న, పంచాక్షరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దరి చేరని పిఎంకిసాన్

సంవత్సరాలుగా అర్హులకు తప్పని నిరీక్షణ

ఆరుగాలం శ్రమించే రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి శ్రీకారం చుట్టింది. 2019 ఫిబ్రవరి 24న ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఒక్కోవిడత రూ.2వేలు చొప్పున సంవత్సరానికి 6వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు 23విడతలు నగదు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేశారు. అయినా కూడా కొత్త లబ్ధిదారులకు ఈ పథకం వర్తింపు కలగానే మిగిలిపోతుంది. 2019 జనవరి 31వరకు పట్టాదారు పాసు పుస్తకాలున్న వారికి మాత్రమే పిఎం కిసాన్ పథకం వర్తించేలా కేంద్ర ప్రభుత్వ మార్గ దర్శకాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత భూములు కొనుగోలు చేసిన రైతుల పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు మార్చుకున్నా వారికి పిఎం కిసాన్ నగదు జమ కావడం లేదు. గత ఏడు సంవత్సరాల నుంచి రైతులు పిఎం కిసాన్ లబ్ధి చేకూరక ఆర్థికంగా నష్టపోతున్నారు. సంబంధిత యజమాని మరణించి వుంటే వారసులకు భూమి సంక్రమిస్తే పిఎం కిసాన్ లబ్ధి చేకూరే వెసులుబాటు కల్పించారు. అయితే మరణ ధృవీకరణపత్రంతో వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. ఇవికాక ఈ-కెవైసీ, విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తదితర సమస్యల కారణంగా జిల్లాలో వేలాదిమంది ఈ పథకానికి దూరమైనారు. అర్హత వున్న రైతులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. 2025లో నగదు జమ కాబడిన కొందరు రైతులకు ఇటీవల విడుదల చేసిన నగదు జమ కాలేదని అంటున్నారు. దీనిపై సమాధానం చెప్పేవారు లేరు. వ్యవసాయశాఖ అధికారులను అడిగితే కొంత సమయం పడుతుందని చెబుతున్నట్లు పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్హులైన రైతులకు పిఎం కిసాన్ పథకం అమలు చేయాల్సిన అవసరం వుంది.

తల్లికి వందనంకు తంటాలు!

బ్యాంకు, పోస్టాఫీసులకు పరుగులు పెట్టిన తల్లులు

తల్లికి వందనం పథకం నగదు జమ కోసం ఖాతాలు తెరిచేందుకు విద్యార్థుల తల్లులు బ్యాంకు, పోస్టాఫీసులకు పరుగులు తీశారు. గత సంవత్సరం వరకు పాఠశాల, కళాశాల విద్యార్థులకు సంబంధించిన నగదు తల్లుల ఖాతాల్లోనే జమ చేసేవారు. పాఠశాల, కళాశాలల్లో చదివే ఎస్సీ విద్యార్థుల పేరిట ఈ సంవత్సరం ప్రత్యేక ఖాతాలు తెరవాలని నగదు జమ తేదీకి రెండు రోజులు ముందు సచివాలయ సిబ్బంది చెప్పారు. దీంతో విద్యార్థుల తల్లులు సమీపంలోని పోస్టాఫీసు, బ్యాంకులకు పరుగులు పెట్టారు. పోస్టాఫీసు, బ్యాంకులకు వెళ్లిన తల్లులకు అక్కడ మరో సమస్య ఎదురైంది. పాన్ కార్డు వుంటేనే విద్యార్థుల పేరిట ఖాతా తెరుస్తామని సిబ్బంది చెప్పడంతో ఖంగు తిన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22న తల్లికి వందనం జమ చేస్తామని వారంరోజుల క్రితమే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సంబంధిత అధికారులు ఖాతాలు తెరవాలని ముందుగా ప్రకటించకుండా మొన్నటి వరకు కాలయాపన చేశారు. నగదు జమ చేసేందుకు రెండు రోజులకు ముందు మాత్రమే ఎస్సీ విద్యార్థుల పేరిట ఖాతాలు తెరిపించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో సచివాలయ సిబ్బంది విద్యార్థుల పేరిట ఖాతాలు తెరవాలని తల్లులకు సమాచారం చేరవేశారు.

బ్యాంకు ఖాతా తెరవకుంటే తల్లికి వందనం పథకం ఎక్కడ దక్కకుండా పోతుందనే ఆందోళనతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లోని బ్యాంకులు, పోస్టాఫీసులకు తల్లిదండ్రులు ఉరుకులు, పరుగులు తీశారు. అలాగే పాన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు నెల్లూరు నగరంలో వంద నుంచి రెండువందల రూపాయలు వసూలు చేస్తుంటే. మండల కేంద్రాల్లో ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు రూ. 500 వరకు వసూలు చేస్తూ దోపిడి చేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో అడిగినంత నగదు సమర్పించుకోవాల్సి వచ్చిందని కొందరు తల్లులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు ఖాతాల హడావుడి నేపథ్యంలో వీరిలో ఎంతమందికి తల్లికి వందనం పథకం నగదు జమ అవుతుందో లేదో వేచి చూడాలి.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి

ప్రీ స్కూల్ పిల్లలకు ఇంగ్లీషు నేర్పుతారు

చిన్నారికి మూడు సంవత్సరాలు వస్తే చాలు తల్లిదండ్రులు నర్సరీ చదువుకు పంపిస్తున్నారు. ఇంగ్లీష్‌లో మమ్మీ, డాడీ, ఎబిసిడీలు చదివితే చాలు వారు మురిసి పోతున్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా పిల్లలకు ఇంగ్లీష్ అక్షరాలు నేర్పించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రీ స్కూల్ పిల్లలకు ఇంగ్లీష్ అక్షరాలు, పదాలు నేర్పేలా సిబ్బందికి శిక్షణ ఇచ్చి డిజిటల్ పాఠాలు చెప్పనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు ఇంగ్లీష్ పదాలు స్పష్టంగా పలికేలా నేర్పిస్తారు. తెలుగుతో పాటు ఇంగ్లీష్‌పై చిన్నారులు పట్టు సాధించేలా పాఠాలు బోధించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా నుంచి ముగ్గురు ఐసిడిఎస్ సిడిపిఓలకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చి వారి ద్వారా మిగిలిన వారికి శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే సిడిపిఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తి చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కొందరు సర్ విధుల్లో వున్నందున కొన్నిచోట్ల శిక్షణలో కొంత జాప్యం జరిగింది. త్వరలో వారికి కూడా పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చిన తర్వాత జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా డిజిటల్ తెరలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బోధన చేస్తున్నారు. డిజిటల్ సామగ్రి, పరికరాలను ప్రభుత్వం సమకూర్చనుంది. బాలల సంపూర్ణ వికాసానికి దోహదం చేసేలా విద్యాబోధన ప్రణాళిక రూపొందించారు. చిన్నారుల్లో వైవిధ్యాన్ని గుర్తించి ప్రోత్సహించనున్నారు. జ్ఞానజ్యోతి అమల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని కీలకం చేశారు. బాలలకు బోధించే అంశాలపై వారికి అవగాహన కల్పించడంతో పాటు ప్రతి నెలా పిల్లల అభ్యసన స్థాయిలను తెలియజేస్తారు. అలాగే ప్రతినెలా సమావేశాలు ఏర్పాటుచేసి పిల్లల ఎదుగుదల, పౌష్టికాహారం అందించడం, ఇళ్ల వద్ద శిక్షణ తదితర ప్రక్రియల్లో వారిని భాగస్వాములను చేయనున్నారు.

ఆదాయం లేదు - ఉపయోగం లేదు!

పెట్టుబడి పెట్టి వ్యాపారం చేసేవారు లాభం ఆశించడం సహజం. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన తర్వాత పైసా ఆదాయం రాకుంటే పరిస్థితి ఎలా వుంటుందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర సహకార బ్యాంకు సహకారంతో నిర్మించిన గోదాముల పరిస్థితి ఇలాగే వుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళిక లేకుండా నిర్మించిన గోదాములు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు భారంగా మారాయి. నిర్మాణ ఉద్దేశం మంచిదే అయినా ఆచరణలో ఆదాయంలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆత్మ నిర్భర్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో గోదాములు నిర్మించేందుకు నాబార్డు విరివిగా రుణాలు ఇచ్చింది. గత ప్రభుత్వం పిఏసిఎస్‌ల ప్రమేయం లేకుండానే భూములు సేకరించి టెండర్లు చేపట్టింది. అప్కాబ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా 500 వందల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించే గోదాముకు 40లక్షల రూపాయలు, వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాముకు 80లక్షల రూపాయల రుణాన్ని 4శాతం వడ్డీకి మంజూరు చేయించింది. వీటి నిర్వహణతో పాటు అప్పు చెల్లించే బాధ్యత సొసైటీలకు అప్పగించింది. గడువు ముగియడంతో కొన్నింటికి వాయిదాల చెల్లింపు మొదలైంది. ఇప్పటివరకు వాటి ద్వారా ఎలాంటి ఆదాయం లేనందున అప్పు చెల్లించడం భారంగా మారింది.

ఆత్మలకు ఓట్లు

తొలగించని బిఎల్ఓలు

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం ఉద్దేశ్యమే అర్హులైన ప్రతిఒక్కరికి ఓటుహక్కు వుండటం. అనర్హులు, చనిపోయినవారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించడం, సార్వత్రిక ఎన్నికలు వచ్చినా, స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినా ఓటరు జాబితాలన్నీ తప్పుల తడకలగానే వుంటున్నాయి. ఎన్నిసార్లు సవరణలు చేసినా చాలాకాలం కిందట చనిపోయినవారు సైతం ఇంకా బతికున్నట్లుగా ఓటరు జాబితాల్లో వారి పేర్లు, ఫోటోలు వుంటున్నాయి. మరికొందరు పేర్లయితే రెండు, మూడు చోట్ల నమోదవుతున్నాయి. ఎన్నికలు రావడం, ఓట్లు వేయడం, ఓటరు జాబితాలో తప్పులు యథావిధిగా వుండటం కొనసాగుతూ వస్తుంది. ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో సర్ కార్యక్రమం పక్కాగా అమలవుతుంది. ఎక్కడా ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం లేకుండా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం జరుగుతుంది. క్షేత్రస్థాయిలోని బూత్ లెవల్ అధికారి నుంచి జిల్లా కలెక్టర్ వరకు ఈ కార్యక్రమంలో తలమునకలై వున్నారు. చాలాకాలంగా ఓటరు జాబితాల్లో చనిపోయిన వారి ఓట్లను తొలగించకపోవడంతో అవి యథావిధిగా వుండిపోతున్నాయి. ఇప్పుడు సర్ కార్యక్రమం జరుగుతుండడంతో మృతుల వివరాలన్నీ బయటపడుతున్నాయి. వీటితో పాటు ఒక్కొక్కరికి రెండు, మూడు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వున్నాయి. జిల్లాలో నిర్వహించిన సర్ సర్వేలో వేలాదిమంది మృతుల పేర్లు జాబితాలో వున్నట్లు గుర్తించారు. అలాగే జిల్లావ్యాప్తంగా వేలాది మంది ఓటర్లు డబుల్ ఎంట్రీ వున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇవి కాక అనేకమంది వలస వెళ్లినట్లు పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సర్ ప్రక్రియను తనిఖీ చేశారు.

లీప్ యాప్ డౌన్‌లోడ్‌కు కార్యాచరణ

విద్యాశాఖ కరసత్తు

లీప్ యాప్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు తమ స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకునే విధంగా జిల్లా విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. విద్యార్థుల హాజరు, పరీక్షల్లో సాధించిన మార్కులతో పాటు వారికి బోధించిన ఉపాధ్యాయుల వివరాలు, అర్హతలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలు.. ఇలా పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్)యాప్‌లో పొందుపరిచారు. ఒకే యాప్‌లో పాఠశాల అకడమిక్ వివరాలు, మౌలిక సదుపాయాల సమాచారంతో పాటు తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు అందులో అవకాశం కల్పించారు. విద్యార్థులు, పాఠశాల సమగ్ర వివరాలు తల్లిదండ్రుల వద్ద కూడా వుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దీన్ని రూపొందించింది. ఈ నేపథ్యంలో యాప్‌ను విద్యార్థుల తల్లిదండ్రులతో డౌన్‌లోడ్ చేయించేందుకు వీలుగా అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో ముందుగా క్లస్టర్ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తారు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్ వుంటే తమ పిల్లల విద్యాపరమైన సమాచారాన్ని ఇళ్లవద్ద నుంచే తెలుసుకునే వెసులుబాటు వుంటుంది. తల్లిదండ్రుల తమ స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి ఎల్ఈఏపి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్ నంబరుకు వచ్చే ఓటిపి ద్వారా యాప్‌ను తెరిచి కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

ఈ యాప్ ద్వారా పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల నామినల్ రోల్స్ కూడా పరిశీలించుకోవచ్చు. పేర్లు, వయసు, ఇతర వివరాలు పొరపాటున నమోదైనా వెంటనే మార్చుకునేందుకు వీలుంటుంది, చదువులో వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రిస్క్రిప్టివ్ హోంవర్క్‌ను ప్రత్యేకంగా ఇచ్చి వారి అభ్యసన నైపుణ్యాలను పెంచుకునేందుకు సహకరిస్తుంది.

నెల్లూరులో మిల్లర్ల మాయాజాలం

విపరీతంగా పెరిగిన బియ్యం ధరలు

మార్కెట్లో బియ్యం ధరలు అమాంతం పెరిగాయి. బిపిటి బియ్యం కిలో ధర రూ.70 పలుకుతుంది. మిల్లర్లు, వ్యాపారులు ఏకపక్షంగా వ్యవహరించి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారు. పశ్చిమాసియా యుద్ధం, ఇంధన ధరలను సాకుగా చూపి 25కిలోల బియ్యం బస్తాకు రూ.150నుంచి 200 రూపాయల వరకు పెంచారు. పౌర సరఫరాల శాఖ జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. రైతులు ఎక్కువగా కామన్ రకం ధాన్యాన్ని విక్రయించారు. ఏ గ్రేడ్ రకాన్ని వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేశారు. సన్నబియ్యం మార్కెట్‌ను మిల్లర్లు, వ్యాపారులు నియంత్రిస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారు. జిల్లాలో పండే ధాన్యానికి ఎక్కడో జరిగే యుద్ధ ప్రభావం ఏంటో అంతు చిక్కని ప్రశ్న. ఒక మిల్లు వద్ద బస్తా రూ.100 పెరిగితే హోల్‌సేల్, సబ్ హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లకు వచ్చే సరికి రూ.150నుంచి 250 రూపాయల వరకు చేరుతుంది. దీనికితోడు సన్నబియ్యం అందులో విభిన్న రకాల పేరుతో ధరలు పెంచి విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. 76కిలోల ధాన్యాన్ని రూ.2,300కు కోనుగోలు చేసి మిల్లులో ఆడించి బియ్యంగా మార్చితే కిలో రూ.52 వరకు ఖర్చవుతుంది. లాభం రూ.5 కలిపినా రూ.57కు విక్రయించాలి. పైగా మిల్లు ఆడించగా వచ్చిన ఉప ఉత్పత్తులు తవుడు, నూకలు, పొట్టు విక్రయాల ద్వారా అదనంగా ఆదాయం వస్తుంది. బహిరంగా మార్కెట్లో కిలోబియ్యాన్ని రూ.65కు విక్రయిస్తూ వినియోగదారులు జేబు గుల్ల చేస్తున్నారు.

ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నా వాటిని తక్కువ మందే తింటున్నారు. కొందరు రైతులు తమ పొలాల్లో పండించిన బియ్యాన్ని వినియోగిస్తున్నారు. జిల్లాల్లో దాదాపు నాలుగులక్షల కుటుంబాలు వ్యాపారుల వద్ద బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత ధర

ప్రకారం ఏ రకం బియ్యమైనా 80నుంచి 100 రూపాయల వరకు పలుకుతుంది. సగటున కోట్ల రూపాయల భారంపడుతుంది. నిత్యావసరాల ధరల నియంత్రణ కమిటీ కేవలం సమావేశానికి పరిమితమవుతుంది.

ఎన్టీఆర్ కొత్త చిత్రం

సూపర్‌హిట్ ఫిల్మ్ 'అరవింద సమేత వీర రాఘవ' తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లోని రెండో సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడయ్యింది. ఎస్.రాధాకృష్ణ (చినబాబు), కళ్యాణ్‌రామ్ ఈ సినిమా నిర్మించనున్నారు. 'ది సన్ ఆఫ్ శివ, ది ప్రైడ్ ఆఫ్ పార్వతి, ది ఎటర్నల్ కమాండర్ అండ్ వన్స్ ఎగైన్ విత్ త్రివిక్రమ్' అంటూ ఈ సినిమా అనౌన్స్ మెంట్ పోస్టర్‌ను ఎక్స్‌లో షేర్ చేశారు ఎన్టీఆర్. 'ది సన్ ఆఫ్ శివ, ది ప్రైడ్ ఆఫ్ పార్వతి అని ఎన్టీఆర్ సంభోదించారు కాబట్టి ఈ సినిమా లార్డ్ కార్తికేయ నేపథ్యంలో రూపొందనున్న సినిమా అనుకోవచ్చు. లోతైన భావోద్వేగాలు, ఉత్కంఠ భరితమైన యుద్ధ సన్నివేశాలు, అద్భుతమైన సరికొత్త ప్రపంచ నిర్మాణంతో ఈ సినిమా ప్రేక్షకులకు అపూర్వమైన అనుభూతిని అందించేలా ఉంటుంది అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం అనిరుధ్ రవిచంద్రన్.

విశ్వక్‌సేన్ చిత్రం

విశ్వక్‌సేన్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఈఎన్ఇ రిపీట్' (ఈ నగరానికి ఏమైంది రిపీట్) రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. ఈ సినిమా నవంబరు 19న విడుదల కానుంది. విశ్వక్‌సేన్ లీడ్ రోల్‌లో తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఈ నగరానికి ఏమైంది' (2018) హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ మూవీకి సీక్వెల్‌గా విశ్వక్‌సేన్–తరుణ్ భాస్కర్ కాంబినేషన్‌లోనే రూపొందుతోన్న చిత్రం ఈఎన్ఇ రిపీట్, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నగరానికి ఏమైంది చిత్రం విడుదలై ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఫ్రెండ్‌షిప్ యాంథమ్ నేపథ్యంలో ఒక వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.

సూర్యతో జై భీమ్ దర్శకుడు

జైభీమ్ వంటి సూపర్‌హిట్ సినిమా తర్వాత హీరో సూర్య, దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ కాంబినేషన్ రిపీట్ అవుతుంది. ఈ చిత్రంలో కయాదు లోహార్ హీరోయిన్‌గా నటిస్తుంది. కెజిఎఫ్, కాంతారా, సలార్ వంటి చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్‌పై విజయ్ కిరంగదూర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమాలు చెన్నైలో జరిగాయి. విజయ్ కిరంగదూర్ మాట్లాడుతూ సూర్య, జ్ఞానవేల్ గార్లతో కలిసి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను తాకే నిజాయితీ గల అర్థవంతమైన కథ చెప్పబోతున్నందుకు హ్యాపిగా ఉందని అన్నారు. మరోవైపు పేద ప్రజలకు ఐదు రూపాయలకే వైద్యం అందించిన సామాజిక సేవకుడు, దివంగత వైద్యుడు తిరువేంగడం వీర రాఘవన్ జీవితం ఆధారంగా ఈ సినిమా రానుందని, ఇందులో తిరువేంగడంగా సూర్య నటిస్తారని టాక్.

రామ్ కొత్త సినిమా

రామ్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సినిమా 'హ్యాష్ టాగ్' ఆర్ఎపిఓ 23 (వర్కింగ్ టైటిల్). రాపో సినిమా టిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి పి.మురళీమోహన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, రవికిషోర్ క్లాప్ ఇచ్చారు. ఈ షాట్‌కు రామ్ స్వయంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ శివార్లలో ప్రారంభించాం. హీరో రామ్ పోతినేనితో పాటు ప్రధాన తారాగణం షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాకు కథ అందించి, హీరోగా, దర్శకుడిగా బాధ్యతలు స్వీకరించారు రామ్. ఆయన కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రను చేస్తున్నారు. అలాగే రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నాం అని యూనిట్ పేర్కొంది.

కళ్యాణం కమనీయం జీవితం

ఖాన్ దురాని, సాహితి ఆవంచ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా కళ్యాణం కమనీయం జీవితం. రవిలోకిరెడ్డి దర్శకత్వంలో పైలా ప్రసాదరావు, కిషోర్ గుండాల నిర్మించిన ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. ఈ చిత్రాన్ని తెలుగులో రాజవంశీ విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ రిలీజ్ చేసి–టైటిల్ బాగుంది. ప్రొడ్యూసర్స్ మంచి ప్రయత్నం చేశారు. పోస్టర్‌తో దర్శకుడి విజన్ తెలుస్తోందన్నారు.

రణబాలి విజయం సాధించాలి

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న చిత్రం రణబాలి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ మూవీ సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఇదిలా ఉంటే రాహుల్ సంకృత్యాన్ పుట్టినరోజు సందర్భంగా విజయ్ దేవరకొండ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ మనం (రాహుల్‌ని ఉద్దేశించి) టాక్సీవాలా సినిమా చేసి తొమ్మిదేళ్లవుతోంది. ఇన్నేళ్లలో మనం జీవితంలో ఎంతో మారిపోయాం. అర్థవంతమైన కథలు రాయాలనే తపన వాటిని అందంగా తెరకెక్కించాలనే ఇష్టం నీలో ఏ మాత్రం తగ్గలేదు. మనం కలిసి చేసింది రెండు చిత్రాలే అయినా ఎన్నో పోరాటాలు చేశాం. మొదటి చిత్రానికి ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ అందుకున్నాం. రణబాలితో మరో విజయం సాధించాలి అని రాసుకొచ్చారు.

అనుకోకుండా హీరోయిన్

కెమెరా వెనుక ఉండాలని కలలు కన్న అమ్మాయి మాళవిక మోహనన్. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తోంది. ఆమె పిచ్చాపాటీగా మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి కెమెరా వెనుక ఉండాలని అనుకునేదాన్ని. నాన్న కె.యూ.మోహనన్ సినిమాటోగ్రాఫర్. ఆయన తీసే షాట్స్ చూస్తూ పెరిగా. అందుకే మాస్ మీడియా చదివి డైరెక్షన్‌లోకి వెళ్లాలనుకున్నా. కానీ ఒక రోజు మమ్ముట్టి సర్ నన్ను చూసి యాక్టింగ్ చేస్తావా అని అడిగాను. అలా పట్టంపోలే సినిమాతో హీరోయిన్‌గా మారిపోయా. కేరళ బ్రౌన్ రైస్, ఫిష్ కర్రీ, క్రిస్పీ ఫ్రైడ్ ఫిష్, పాపడ్ ఉంటే చాలు. అదీ చేత్తో తింటేనే అసలు టేస్ట్ అంది ఈ సొగసరి.

ఇస్మార్ట్ బ్యూటీ అంటే ఇష్టం

మాస్ డైలాగ్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది నభా నటేష్. గ్లామర్ పాత్రలకు పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న క్యారెక్టర్స్ కోసం ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటుందీ ఇస్మార్ట్ బ్యూటీ. తెలుగులో తన సినీ పయనం గూర్చి చెబుతూ టాలీవుడ్‌లో ఫస్ట్ మూవీ నన్ను దోచుకుందువటేలో నటనకు మంచి మార్కులే పడ్డాయి. అయితే ఇస్మార్ట్ శంకర్‌లోనే ఎక్కువ గుర్తింపు వచ్చింది. ఆ మూవీ తర్వాత నుంచే అందరూ ఇస్మార్ట్ బ్యూటీ అని పిలుస్తున్నారు. చిన్నప్పటి నుంచి అలవాటు ఉండడంతో యాక్టింగ్‌ని ఎంజాయ్ చేస్తానంది. తెలుగులో తన అభిమాన నటీనటులు పవన్‌కళ్యాణ్, అనుష్క శెట్టి అని చెప్పింది.

వారణాసిలో భావోద్వేగం

అగ్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తాను ప్రస్తుతం తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమాకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకొన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన అంతర్జాతీయ యానిమేషన్ చిత్రోత్సవానికి హాజరైన ఆయన అక్కడి ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ 'వారణాసి' కథకు మూలం తండ్రీ తనయుల మధ్య భావోద్వేగమే అని చెప్పారు. ఆయన మహేష్‌బాబు హీరోగా ప్రస్తుతం తెరకెక్కిస్తున్న వారణాసి సినిమాలో హంగులు ఏ స్థాయిలో ఉంటాయో ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రంతో చాటి చెప్పారు. రామాయణం ఆధారంగా రూపొందుతున్న సినిమా ఇదని ఆయన వెల్లడించారు. కెఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తోన్న వారణాసి చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది.

సోల్జర్... ఆన్‌డ్యూటీ

కొనంకి కార్తీక్, ప్రియాంక వర్మ ప్రధాన పాత్రధారులుగా శ్రద్ధ ఖత్రి తెరకెక్కిస్తోన్న చిత్రం సోల్జర్. 24x7 ఆన్ డ్యూటీ అనేది ఉపశీర్షిక. కె.వి. నాయుడు నిర్మాత. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ఇటీవల విడుదల చేసింది చిత్రబృందం. దేశం కోసం అహర్నిశలు కృషి చేసే ఒక ఒక సైనికుడి కథతో రూపొందుతున్న సినిమానే ఇదని సినీవర్గాలు చెప్పాయి.

ఎవరిని మెప్పించక్కర లేదు

తెలుగు తెరకు రావు బహుద్దూర్ చిత్రం ద్వారా మరో కేరళ కుట్టి దీప థామస్ పరిచయమయ్యింది. ఆమెను తన గూర్చి వివరాలు చెప్పమంటే బిఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన తర్వాత అనుకుకోండా మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టానంది. తాను మంచి భోజన ప్రియురాలినని, అలాగని ఫిట్‌నెస్ విషయంలో అశ్రద్ధ చేయనంది. ఏది జరిగినా దాన్నలా జరగనివ్వండి. ఒక్కొక్కరూ ఒక్కోలా మన గూర్చి మాట్లాడుతుంటారు. వాళ్ల గురించి మన అలవాట్లు మార్చుకోవాల్సిన పనిలేదు. ఎవరినీ మెప్పించడానికి జీవించకండి. మీ కోసం మీరు జీవించడమనేది నా ఫిలాసఫీ. సంతోషకర విషయమైనా, బాధపెట్టే విషయమైనా నా జీవితంలో జరిగే ప్రతిదీ ఒక పుస్తకంలో రాసుకుంటా. ఈ అలవాటు వల్ల నాలో ఒత్తిడి తగ్గుతుందంది.

డిసెంబర్‌లో ఎస్‌వైజి

సాయి దుర్గాతేజ్ హీరోగా తెరకెక్కుతోన్న ఎస్‌వైజి (సంబరాల ఏటిగట్టు) చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఇటీవలే చివరి షెడ్యూల్ మొదలయ్యింది. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఆ వివరాల్ని తెలుపుతూ సినిమాను డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లుగా ఒక ప్రకటనలో వెల్లడించారు నిర్మాతలు. హనుమాన్ చిత్రం తర్వాత ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె.నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న చిత్రమిది. రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తున్నారు. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్. జగపతి బాబు, సాయికుమార్, శ్రీకాంత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అప్పుడే రాజకీయ లోపాయికారి ఒప్పందాలు

కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో...

లోపాయికారి రాజకీయాలకు సింహపురికి పేరు.. ముఖ్యంగా నెల్లూరు నగరం అంటే నీచ రాజకీయాలు మరీ ఎక్కువ. అన్నీ పార్టీలది అదేబాట. ఎప్పటి నుంచో ఉన్న పార్టీలు, నిన్నమొన్న పుట్టిన పార్టీలు ఇందుకేమీ మినహాయింపు కాదు. ఇదంతా ఎందుకు చెబుతు నామంటే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో నెల్లూరు కార్పొరేషన్ పాలకవర్గం పదవీ కాలం కూడా పూర్తవుతుంది. నెల్లూరు కార్పొరేషన్‌కు కూడా ఎన్నికలు జరుగుతాయని భావిస్తున్నారు. కూటమి పార్టీలు ఒకవైపు, వైసిపి ఒకవైపు ఎన్నికల బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి.

బిజెపి, వైసిపి కుమ్మక్కు?

ఈ ఎన్నికల్లో బిజెపి, వైసిపి కుమ్మక్కవుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. సీట్ల సర్దుబాటులో కూటమి ధర్మం ప్రకారం నగరంలో కొన్ని డివిజన్లు బిజెపి, జనసేనకు కేటాయించాలి. వైసిపి నుంచి బరిలో ఉండే నేతలకు, కొంతమంది బిజెపి నాయకులతో సత్సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తమకు అనుకూలంగా ఉన్న వైసిపి నేతలు బరిలో ఉన్న డివిజన్లను బిజెపి నేతలు తమకు కేటాయించాలని కోరనున్నట్లు సమాచారం. ఉదాహరణకు నగర నియోజకవర్గంలోని 45వ డివిజన్‌కు ప్రస్తుతం వైసిపి నేత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ డివిజన్ వైసిపి నేత ఒక కార్పొరేషన్ పదవి పొందిన బిజెపి నాయకుడికి బంధువని తెలుస్తోంది. ఆ బిజెపి నేత వైసిపిలోని తన బంధువుకు న్యాయం చేసేందుకు పొత్తు ధర్మంలో భాగంగా 45వ డివిజన్‌ను తమకు కేటాయించాలని మంత్రిని కోరేందుకు సిద్ధమవుతున్నారట. బిజెపి నుంచి ఒక డమ్మీ అభ్యర్థిని 45వ డివిజన్‌లో నిలబెట్టి వైసిపి నుంచి పోటీ చేసే తన బంధువును గెలిపించుకోవాలని ఆ నేత పన్నాగమట.

వారు త్యాగరాజులేనా..

45వ డివిజన్‌లో తెలుగుదేశం అభ్యర్థిత్వాన్ని ఒక డాక్టర్ ఆశిస్తున్నారు. డివిజన్‌లో ఆయన ప్రతిరోజూ విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. మంత్రి నారాయణ కూడా 45వ డివిజన్ నీకే అని హామీ కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో బిజెపి ఈ సీటు ఆశిస్తుండటం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి నారాయణ బిజెపి నాయకుడి మాటను కాదనలేని పరిస్థితి. ఇప్పుడు 45వ డివిజన్ ఆశిస్తున్న డాక్టర్ పరిస్థితి ఏమిటి.. త్యాగరాజులా మిగిలి పోవడమేనా అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నగర నియోజకవర్గంలోనే ఈ విధమైన లోపాయికారి ఒప్పందాలకు తెర లేపారు. మంత్రి నారాయణ ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

చిల్డ్రన్స్ పార్కును ఇంకా అభివృద్ధి చేస్తా!

మంత్రి నారాయణ ప్రతిన

నెల్లూరు నగరంలోని పార్కు స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి నారాయణ హెచ్చరించారు. మంత్రి నారాయణ చిల్డ్రన్స్ పార్కును సందర్శించారు. మంత్రికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పార్కు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిల్డ్రన్స్‌పార్కును రాజమండ్రిలో ఏర్పాటుచేసిన పార్కు తరహాలోనే అభివృద్ధి చేస్తామని తెలిపారు. పార్కును ఆధునీకరించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌ను ఆయన పరిశీలించారు. వచ్చే మూడు నెలల్లో చిల్డ్రన్స్ పార్కులో ఆధునిక ఆట పరికరాలు, స్లైడ్రైవ్, జిప్‌లైన్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. లే అవుట్లలో పార్కుల కోసం కేటాయించిన స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తున్నారని సమాచారం అందిన వెంటనే అధికార యంత్రాంగం స్పందిస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలోని అన్నీ పార్కులను ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌బికెఆర్‌లో పాలిటెక్నిక్ కోర్సులు ప్రారంభం

కోట మండలం విద్యానగర్‌లోని ప్రముఖ విద్యాసంస్థ ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ రవీంద్రరెడ్డి తెలిపారు. సిఎస్ఈ, ఈసీఈ, ఇఇఇ,ఎంఈ కోర్సులకు కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్లు ఇస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని ఆయన తెలిపారు. శ్రీసిటీ మరియు బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుతారని తెలిపారు.

స్కూల్ పిల్లలకు

నారాయణ సైకిళ్లు రెడీ

చదువుల రేసులో పేద బిడ్డలను విజేతలుగా నిలపడమే తమ ముందున్న లక్ష్యమని మంత్రి నారాయణ కుమార్తె సింధూర నారాయణ పేర్కొన్నారు. మంత్రి నారాయణ దాతృత్వంతో త్వరలో నెల్లూరు నగరంలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పదివేల మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. తొలి విడతలో ఏడువేల మందికి సైకిళ్లు ఇస్తున్నారు. సైకిళ్లు విఆర్ హైస్కూల్ మైదానంలో ఉంచారు. సైకిళ్లను డాక్టర్ సింధూర నారాయణ పరిశీలించారు. అనంతరం కాసేపు విద్యార్థులతో కలిసి సరదాగా సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి నారాయణ ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేందుకు కంకణబద్ధుడై ఉన్నారన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 23 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ గ్రూప్ విద్యాసంస్థల తరుపున పదివేల హీరో సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తొలివిడతలో ఏడువేల మందికి సైకిళ్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సైకిళ్లు పంపిణీ కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడుతూ వస్తోందని తెలిపారు. బాలికల డ్రా పౌట్స్ శాతాన్ని తగ్గించేందుకు మంత్రి నారాయణ ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. నెల్లూరు నగరంలోని మున్సిపల్ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు, బోధనా మెటీరియల్స్ అందిస్తూ మద్దతుగా నిలుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న నెల్లూరు

పట్టించుకోని మంత్రి

నెల్లూరు నగరం కంపుకొడుతోంది. సాక్షాత్తు మున్సిపల్ మంత్రి నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు నగరమే దుర్గంధభూయిష్టంగా తయారైంది. అసలే నగరంలో డ్రైనేజి వ్యవస్థ అంతంత మాత్రం. దీనికి తోడు కాలువల నిర్మాణం పేరుతో అరకొర పనులు చేసి కాసులు దండుకొంటున్నారు. మంత్రి నారాయణకు కాగితాల్లో రంగు రంగుల బొమ్మలు వేసి చూపించి అధికారులు మాయ చేస్తున్నారు. కాగితాల్లో ఉన్న బొమ్మలు చూసి మంత్రి నారాయణ మురిసిపోతున్నారు.

సిల్ట్‌లు తీసి రోడ్డుపైన వేసి..

ఇటీవల నగరంలోని కాలువల్లో సిల్ట్ తీసి రోడ్డుపక్కన పడేశారు. రోజుల తరబడి రోడ్డు పక్కన ఉన్న సిల్ట్ తరలించలేదు. ఇటీవల రెండు రోజులు వరుసగా అడపదడపా వర్షం కురిసింది. దాంతో సిల్ట్ మళ్లీ కాలువల్లోకి జారిపోయింది. దీనికి తోడు కుక్కలు సిల్ట్‌లో దొర్లాడి నానా భ్రష్టత్వం పట్టిస్తున్నాయి. కొన్ని చోట్ల అయితే రోడ్డుకు అడ్డంగా సిల్ట్ వేశారు. ఆస్పత్రులు ఎక్కువగా ఉండే పొగతోట, నగరంలోని మరిన్ని ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులు నెలకొని ఉన్నాయి. మూడు హాళ్ల దగ్గర కొద్దిపాటి వర్షానికే నీళ్లు నిలబడిపోతున్నాయి.

దృష్టి పెట్టని మంత్రి

క్షేత్రస్థాయిలో నెల్లూరు నగరం భ్రష్టుపట్టిపోతున్నా మంత్రి దృష్టి పెట్టడం లేదు. అమరావతి నిర్మాణ బాధ్యతలు మంత్రి నారాయణపై ఉండటంతో ఆయన ఎక్కువ సమయం రాజధానిలో ఉంటున్నారు. తన నియోజకవర్గం అభివృద్ధికి అధికారులు, ఆయన చుట్టూ ఉన్న కోటరీపై ఆధారపడ్డారు. ఇక్కడ అధికారులు, కోటరీ కుమ్మక్కై మంత్రి నారాయణను తప్పుదోవపట్టిస్తూ వస్తున్నారు. మంత్రి ఎప్పుడైనా నెల్లూరు నగరంలో ఉన్నపుడు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సివస్తే పార్కులను చూసి వెళ్తున్నారు. పార్కులు ఇప్పటికే అభివృద్ధి చెంది ఉన్నాయి. పార్కులలో వేసిన రంగులు చూసి నగరమంతా ఇదేవిధంగా అభివృద్ధి చెంది ఉందని మంత్రి నారాయణ భ్రమిస్తున్నారు. కాగితాల్లో కాకి లెక్కలు, రంగుల బొమ్మలు చూడకుండా క్షేత్రస్థాయిలో నగరం ఎలా ఉందో మంత్రి నారాయణ స్వయంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

మొహమాటానికి అవార్డు ఇచ్చారా?

నెల్లూరు నగరంలో చెత్త లేదా?

స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ క్లీన్ స్వీప్–30 రోజుల కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు నెల్లూరుకార్పొరేషన్‌కు బెస్ట్ పర్‌ఫార్మింగ్ యుఎల్‌బి అవార్డు అందజేశారు. నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో మన ఘనత వహించిన కార్పొరేషన్ అధికారులు అపారమైన ప్రతిభ కనపరిచారని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఇస్తూ అవార్డు అందజేశారు. ఇటీవల నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ దినేష్ సిఎం చంద్రబాబునుంచి ఈ అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ అవార్డు ఇచ్చారా, లేకుంటే కార్పొరేషన్ అధికారులు పంపిన మాయా చిత్రాల ఆధారంగా అవార్డు ఇచ్చారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మొహమాటానికి ఇచ్చారు..

పురపాలక మంత్రి నారాయణ సొంత నియోజకవర్గం నెల్లూరుసిటీ. మంత్రి నారాయణ మెప్పు కోసం నెల్లూరు కార్పొరేషన్‌కు బెస్ట్ పర్‌ఫార్మింగ్ అవార్డు ఇచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉంది. ఎక్కడ మురుగు అక్కడే ఉంటోంది. కాలువల్లో కూడా పూడిక తీత తూతూమంత్రంగా సాగుతోంది. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం నిర్వహించినప్పుడు కూడా కార్పొరేషన్ అధికారులు ఫోటోలకు ఫోజులిచ్చి వెళ్లిపోయారు. నగరంలో దుర్భరమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. నగరం పరిశుభ్రత కాగితాల్లోనే ఉంటుంది. అధ్వానంగా ఉన్న నగరానికి బెస్ట్ పర్‌ఫార్మింగ్ అవార్డు ఎలా ఇచ్చారో...

వారాహి అమ్మవారి హోమం

కల్లూరుపల్లిలో జరిగింది

నెల్లూరు కల్లూరుపల్లిలోని శ్రీఆది పరాశక్తి మహాకాళి సమేత మహా మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. 23వ తేది వారాహి అమ్మవారి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు నూనె మల్లికార్జునయాదవ్ హోమానికి ఉభయకర్తగా వ్యవహరించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం బాగుండాలని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని కోరుతూ హోమం నిర్వహించినట్లు తెలిపారు. హోమాన్ని ఆలయ అర్చకులు గంగాప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దేవదూత గుండెలు

మొదటి పేజీ కొరవ

నుంచి సుదూరంలో వుండే అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి కూడా యువతీ యువకులు తరలి వస్తూనే వున్నారు. జంతర్ మంతర్ ధర్నా కేంద్రాన్ని జనసమర్ధంగా నిర్వహిస్తున్నారు. దీని నుంచి స్ఫూర్తి పొందిన షబానా ఆజ్మీ, కిరణ్‌బేడి వంటి ప్రముఖులు యువతకు మద్దతు పలకడానికి జంతర్ మంతర్‌కు విచ్చేయడం ఒక విశేషం.

రాజకీయ పార్టీల ప్రమేయాన్ని, రాజకీయ ప్రయోజనాలను తమ ఉద్యమంలోకి ప్రవేశించని వ్యకుండా నిగ్రహం పాటిస్తున్నారు బొద్దింకల పార్టీ నాయకులు. ఆ పరిణామమే కేంద్ర ప్రభుత్వాన్ని కలవర పెడుతున్నది. కాంగ్రెస్ వంటి పార్టీలు ఇందులో దూరితే, వారి మీద నిందలు వేసి, ఉద్యమాన్ని పక్క దారి పట్టించే విద్యలలో ఆరితేరిన బిజెపికి ఇప్పుడు దిక్కు తోచడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం ఎక్కడో తేల్చుకోలేక పోతున్నారు. ప్రధాని మోడీ పలుకుతున్న అనునయ వ్యాఖ్యలు బొద్దింకలను సంతృప్తిపరచడం లేదు. తాము కోరినట్లు విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మ ప్రతిజ్ఞ చేస్తున్నారు బొద్దింకలు.

ధర్మేంద్రను కదిలిస్తే తేనె తుట్టెలు కదులుతాయి

ఇంత జరుగుతున్నా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిద్ధపడడం లేదు. ఆయన చేత రాజీనామా చేయించే సాహసం ఏ బిజెపి నేతకు కూడా లేదు. అందుకు కారణం – గత పన్నెండేళ్ల మోడీ పాలనలో జరిగిన ఎన్నో కుంభకోణాలు, గోల్‌మాల్ వ్యవహారాల మీద ధర్మేంద్ర ప్రధాన్ వద్ద నిర్దుష్టమైన ఆధారాలున్నాయని చెప్తున్నారు. పదేళ్లపాటు పెట్రోల్ మంత్రిగా వున్న సమయంలో ఒక్క ఓఎన్‌జిసి నుంచి ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలకు 600 కోట్ల రూపాయలకు పైన నిధులు ఇప్పించినట్లు బయటపడింది. పెట్రోలియం మంత్రి శాఖ క్రింద అటువంటి సంస్థలు చాలానే వున్నాయి. అవన్నీ ఇంకెన్ని వేల కోట్ల నిధులు ప్రవహింప చేశాయో, వాటి ఖర్చు లెక్కలే మిటో ఒక్క ధర్మేంద్ర ప్రధాన్‌కు మాత్రమే తెలుసు. మరొక ప్రక్క బీహార్, ఒరిస్సా, హర్యానా, పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో బిజెపి ఆర్థిక భారం మొత్తం ఆయనే మోశారన్న వార్తలున్నాయి. అది కూడా వేల కోట్ల లెక్క తేలే మొత్తమే. ఈ లెక్కలు బయటపడితే మోడీ సర్కారు కూసాలు కదిలిపోతాయి. ఆ భయంతోనే, యువతలో పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తున్నదని తెలిసినా, దాని ప్రభావం రేపటి ఎన్నికల మీద వుంటుందన్న అభిప్రాయం వున్నా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో ప్రధాని మోడీ పట్టుదలగా వ్యవహరిస్తున్నారు. ఈ తాడు ఎప్పుడు తెగుతుందో, తెగే దాకా లాగితే వచ్చే ప్రమాదాలేమిటో వేచి చూడవలసిందే.

ఉదయగిరిలోని హజరత్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ దర్గా ప్రాంగణంలో ఆధ్యాత్మిక గురువు, దివంగత మహమ్మద్ హనీఫ్ అయాజ్ ఖాలిది వ్రాసిన ఉదయగిరి మహనీయులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయవాది సయ్యద్ రజి అహ్మద్.

దిసిసి ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు పొదలకూరురోడ్డులోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో పేద విద్యార్థులకు దుప్పట్లు ప్రదానం చేశారు. చిత్రంలో విమానాశ్రయాధికారి రాజ్‌కిషోర్ తదితరులున్నారు.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

కరు దుకాణంలోకి వచ్చి శనగపప్పు అడిగారు. అందుకు ఆమె కౌంటర్ నుంచి పైకి లేస్తుండగా ఆమె మెడలోని గొలుసు లాక్కొని బైక్‌పై ఎదురుచూస్తున్న మరో నిందితుడితో కలసి పరారయ్యారు. బాధితురాలు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ

నెల్లూరు గాంధీనగర్‌లోని శ్రీ షిర్డిసాయి బాబా మందిరంలో గురుపూర్ణిమ మహోత్సవాలు 29వ తేదీ నుంచి ఆగష్టు 6వ తేదీ వరకు జరుగుతాయి. ప్రతినిత్యం ఏకాదశ రుద్రాభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, 5వ తేది బాబా నగరోత్సవం, 6వ తేది అన్నదానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల్లో పాల్గొనాలనుకొన్నవారు మందిర గుమస్తా వద్ద 300 రూపాయలు చెల్లించి రశీదు పొందాలని శ్రీ షిర్డిసాయిబాబా మందిర కార్యవర్గం స్పష్టం చేసింది.

కొరడావీధిలో రంగుమారిన నీళ్లు

నెల్లూరు చిన్నబజారులోని కొరడావీధిలో రంగు మారిన తాగునీరు వస్తుంది. కుళాయిల్లో నీరు రంగు మారడంతోపాటు వాసన వస్తున్నట్లు స్థానికులు లబోదిబో మంటున్నారు. స్నానం చేస్తే చర్మవ్యాధులొచ్చే ప్రమాదం కూడా వుంది.

జనవాణి

2వ పేజీ కొరవ

నెల్లూరులో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర 979 రూపాయలయ్యింది. గ్యాస్ బాయ్ మామూలుగా తీసుకొనే 30 రూపాయలతో కలుపుకొంటే వెయ్యి రూపాయలన్న మాట. యుద్ధం బూచిగా చూపి గడచిన మూడు నెలల్లో వంట గ్యాస్ సిలిండర్ ధరను 89 రూపాయలుగా పెంచారు. ఇప్పుడు పరిస్థితులు సద్దుమణిగాయి. కాబట్టి వంట గ్యాస్ సిలిండర్ పై వంద రూపాయలు తగ్గించమనవి.

ఎన్.భార్గవి నెల్లూరు

కమిషనర్ మారాలి

నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ నందన్ చుట్టూ వివాదాలు ముసురు కుంటున్నాయి. అధికార పార్టీ నాయకులు మెప్పు కోసం కమిషనర్ నందన్ పరిధి దాటి ప్రవర్తిస్తూ అభాసుపాలవుతున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఉన్నప్పుడు ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించేవారు. ఇప్పుడు టిడిపితో అంటకాగుతూ మంత్రి నారాయణ గారి చేత బిఎల్ఓలకు దిశా నిర్దేశం చేయించి విమర్శల పాలయ్యారు. ఇది పద్ధతి కాదు ఆయన మారాలి.

పి.రామకృష్ణ నెల్లూరు

ముద్‌'రగడ' మానవత్వం

ముద్ 'రగడ' సుమారు మూడు దశాబ్దాల కిందట అనుకుంటా... ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన ఒక వార్తకు శీర్షిక ఇది. పాఠకుల్లోకి ఈ శీర్షిక అలా దూసుకెళ్లింది. శీర్షిక చూడగానే వార్తలో ఏమి వుందో ఇట్టే అర్థమైపోతుంది ఇది వివాదానికి సంబంధించిన వార్త అని, అది ముద్రగడ పద్మనాభంకు సంబంధించినదని. ఒక ముక్కలో పాఠకునికి సూటిగా వేగంగా తగిలేలా శీర్షిక పెట్టిన నాటి ఉప సంపాదకుడు నిజంగా అభినందనీయుడు. ముద్ర గడ పద్మనాభం గారి ప్రస్తావన ఎప్పుడు వచ్చినా నా మస్తిష్కంలో ముందుగా మెదిలేది ఈ శీర్షికే...!

ముద్రగడ పద్మనాభం గారి రాజకీయ జీవితం తొలి నుంచీ వివాదాల మధ్యనే సాగింది. చివరకు ఆయన మరణమూ వివాదాస్పదమే అయింది. ఆయన భౌతికకాయం చుట్టూ రాజకీయం (శవ రాజకీయం) చోటు చేసుకుంది. ఆయన మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని కొందరు తాపత్రయ పడితే మరికొందరు ఘనత కోసం పాకులాడారు. నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో... మరీ ముఖ్యంగా ఏపీలో శవాల చుట్టూ రాజకీయం చోటు చేసుకోకపోతే ఆశ్చర్యం గానీ, చోటు చేసుకుంటే ఆశ్చర్యపడాల్సిన పనే లేదు. అలాంటి వివాదాల జోలికి పోవడం నా అభిమతం కాదు గానీ, ముద్రగడ మరణించిన ప్రస్తుత సందర్భంలో ఆయనలోని మానవీయ కోణం ఆవిష్కరించడమే నా ఉద్దేశ్యం. ఆ మహాశయుడు మరణించి పది రోజులైంది. ఆలస్యంగానైనా సరే మూడున్నర దశాబ్దాల క్రితం మా ఊరికి (ప్రొద్దుటూరు) చెందిన వైద్య కుటుంబానికి ముద్రగడ చేసిన పరోక్ష సాయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నాను. ఒక వ్యక్తి ఏదైనా చెడు చేస్తే సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతాయి. మంచి చేస్తే దానినెవ్వరూ పెద్దగా చెప్పుకోరు. మంచి చేసిన వ్యక్తి గురించి చెప్పడమే నా ఉద్దేశ్యం.

ఇక అసలు విషయానికి వస్తే.... 1985-89 మధ్యకాలంలో ముద్రగడ పద్మనాభం అప్పటి ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు మంత్రివర్గంలో అబ్కారీ శాఖ మంత్రిగా వుండేవారు. అబ్కారీ శాఖ ఎంతటి కీలకమైనదో... వేరే చెప్పనక్కర లేదు. నేనప్పుడు ఈనాడు దినపత్రిక స్టేట్ బ్యూరోలో స్టాఫ్ రిపోర్టర్‌గా వుంటూ అడపా దడపా సచివాలయం బీట్ వ్యవహారాలు చూసే వాడిని.

మా ఊళ్లో నా బాల్యం నుంచీ నేను బాగా ఎరిగిన డాక్టర్ ఎన్.ఎం.ప్రభుదాస్ (ఆర్.ఎం.పి) మా కుటుంబ వైద్యులు. మా ఇంట్లో ఎవరికి సుస్తీ చేసినా తొలుత ఆయననే సంప్రదించే వాళ్లం. ఆయన తన ఇంటిని అబ్కారీ శాఖ వారికి వారి స్టేషన్‌ను నిర్వహించుకోవడం కోసం (మూడేళ్ల ఒప్పందంతో) అద్దెకు ఇచ్చారు. కొంతకాలం గడిచాక తన ఇంటిని ఖాళీ చేయండని స్థానిక అధికారులకు విజ్ఞప్తి చేయగా వారు అందుకు ససేమిరా అన్నారు. డాక్టర్ ఇల్లు ప్రధాన వీధిలో వుంది కనుక తమకు అన్ని విధాలా సౌకర్యంగా వుంది కనుక అద్దె కావాలంటే కొద్దో గొప్పో (ప్రభుత్వ నిబంధనల ప్రకారం) పెంచుతాం గానీ ఆ ఇంటిని మాత్రం ఖాళీ చేయబోమని చెప్పసాగారు. వయో వృద్ధుడైన డాక్టరు గారు అబ్కారీ శాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. దశాబ్దం గడిచినా తన ఇంటిని అబ్కారీ శాఖ వారు ఖాళీ చేయకపోవడంతో ఆయన నా సాయం కోరారు. సొంత ఇంటిని కాదనుకుని బయట అద్దె ఇళ్లల్లో వుండాల్సిన పరిస్థితిలో వున్నానని చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చి ఖాళీ చేసేందుకు కనుక ప్రయత్నిస్తే తన జీవిత కాలం న్యాయ పోరాటంలోనే గడిచి పోతుందనే భయాందోళనలను ఆయన వ్యక్తం చేశారు. అంతేకాక స్థానిక రాజకీయ నాయకులు (కాంగ్రెస్, టిడిపి) అబ్కారీ అధికారులకే వత్తాసు పలుకుతూ 'ఖాళీ చేయాలని పట్టు పట్టాకు - నీకేమి అద్దె వస్తాండాది గదా' అని హితబోధ చేసే వారు.

పరిస్థితి తెలుసుకున్న నేను డాక్టర్ గారి సతీమణి రాజమ్మ గారి చేత (ఆ ఇల్లు ఆమె పేరు మీదే వుంది) మంత్రి గారిని ఉద్దేశించి ఒక వినతి పత్రం రాయించుకుని సచివాలయంలో ముద్రగడ గారిని కలిసి ఆయనకు ఇచ్చి ఇంటిని ఖాళీ చేసేలా ఆదేశాలిచ్చి ఆ వృద్ధ దంపతులను ఆదుకోండి అని కోరాను. వినతి పత్రం సాంతం చదవిన పద్మనాభం గారు దానిపై తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ విషయమై మళ్లీ నేను ఆయనను కలిసిందే లేదు. సుమారు రెండు నెలల తరువాత నేను మా ఊరు వెళ్లినపుడు సదరు డాక్టరు గారు మా ఇంటికి వచ్చి 'బాషా... నీ మేలు నేను మరువ లేను... ఇన్నాళ్లుగా కాని పని నీ వల్ల అయింది' అని చెమర్చిన కళ్లతో చెప్పారు. అలా ఆ డాక్టరు గారు నాకు చెప్పడమే కాదు, తన వద్దకు వచ్చిన వారందరికీ తన ఇల్లు ఫలానా బాషా ఖాళీ చేయించాడు. అని ఆనందంతో చెప్పుకున్నారు. మా నాన్న గారు ఆర్. అల్లాబక్ష్ (మాజీ ప్రధానోపాధ్యాయులు)లకు ఈ డాక్టర్ బాగా సన్నిహితులు కావడంతో వారి మిత్రబృందం అందరిలోనూ ఈ విషయం మారు మోగింది.

ఇది నా ఘనత కానే కాదు. ముమ్మాటికీ ముద్రగడ పద్మనాభం గారి ఘనతేనని వేరే చెప్పాలా? వినతి పత్రం ఇచ్చే నాటికి పద్మనాభం గారు నాకు పెద్దగా పరిచయం కూడా లేదు. అంతగా తెలియక పోయినా శ్రద్ధ తీసుకుని రెండు నెలల్లోపు కార్యాలయపు అద్దె భవనాన్ని ఖాళీ చేయించారంటే అదెంత మాత్రం చిన్న విషయం కాదు. ఏవైనా పనుల విషయమై మంత్రుల, అధికారుల వద్ద పడిగాపులు కాసినా ఫలితం లభించని నేటి పరిస్థితుల్లో నాడు పద్మనాభం గారు మానవత్వంతో చూపించిన చొరవ కీర్తించదగిందిగా భావిస్తున్నాను.

అబ్కారీ శాఖలో అప్పట్లో ఏ.ఇ.ఎస్‌గా పని చేసిన జైనుల్ ఆబ్దీన్ అనే అధికారి కూడా నన్ను కలిసిన ఒక సందర్భంలో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ 'ప్రొద్దుటూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని ఖాళీ చేసే వరకూ తమకు మంత్రి (ముద్రగడ) గారి కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చేవని, ఖాళీ చేసే వరకూ తమను గుక్క తిప్పుకోనివ్వలేదని పేర్కొన్నారు.

అన్ని అవలక్షణాలకు ఆలవాలమైన అబ్కారీ శాఖను ముద్రగడ పద్మనాభం గారు నిబద్ధతతో నిర్వహించడాన్ని అప్పట్లో అధికార పక్షం వారే కాదు, ప్రతిపక్షాలు కూడా కీర్తించాయి. ఆయన ఆ శాఖను నిర్వహించినంత కాలం ఒక్క విమర్శకు తావు లేకుండా పని చేశారని ప్రతీతి.

ఉదారత, నిజాయితీ, నిబద్ధత గలిగిన పద్మనాభం వంటి అందరికీ పనికి వచ్చే మహానుభావుడు తనను తాను ఒక సామాజిక వర్గానికి ఆపాదించుని ఆ వర్గం నేతగా మిగిలి పోవడమే ఇక్కడ బాధ కలిగించే విషయం.

ఆర్.మహబూబ్ బాషా
జర్నలిస్టు & మాజీ చీఫ్ కమిషనర్,
ఏపి సమాచార కమిషన్, సమాచార హక్కు చట్టం-2005

• అరిష్ట భూతవేద దోషానికి...

అష్టదిగ్బంధన వ్రత పూజ ఉత్తమం!

కె.హైమ నెల్లూరు

** గృహంలో ఏ పరిస్థితులూ బాగోలేవు. అందరూ ఉద్యోగస్తులైనా ఆర్థికంగా చాలా ఇబ్బంది పైగా అనారోగ్యాలు విపరీతం ఏమి చేయాలి స్వామీ!?*

ఇలాంటి పరిస్థితులకు శని, రాహు, కుజ దోష పీడనలు, గృహవేధ, భూతవేధ, శక్తివేధ అన్నీ కలిసి కారణం అవుతాయి. శాస్త్రాలలోని నూట ఇరవై పూజా విధానాలలో యంత్రపూజ తర్వాత "అష్ట దిగ్బంధన పూజ" చాలా సందర్భాల్లో ఉత్తమంగా కనిపిస్తుంది.

టి.వి.విశ్వేశ్వరరావు తోటపల్లి గూడూరు

** మా గ్రామం మొత్తంలో యాభై శాతం ఉన్న వాళ్లే. వారిలో చాలామంది ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో వుంటారు. కారణం అర్థం కాదు స్వామీ?*

ఇంట్లో అవాస్తు దోషాలు, జాతక దోషాలు ఇందుకు కారణం కావొచ్చు. ఇవి బాగుంటే సంపూర్ణ గ్రామ వాస్తు చూడాలి. ఇందులో నాభి స్థానంలో దోషాలున్నా, బ్రహ్మ స్థానంలో గృహాలున్నా గ్రామస్తులెప్పటికీ కోలుకోలేరు. ఒకసారి సంప్రదించండి.

పసుపులేటి ప్రశాంతి గూడూరు

** ఊరిలో ఎనభై శాతం వ్యవసాయదారులే - ఏ ఒక్కరూ సంతోషంగా వున్నట్లు నాకనిపించడం లేదు. దోషాలా? దుష్టశక్తులా??*

గూడూరులో వాస్తు దోషా లెక్కువ. బైపాస్-రోడ్డు వల్ల తూర్పు ఎత్తయిపోయింది. దక్షిణం చెరువు, నైరుతి ప్రాంతంలోని స్మశానం వల్ల చాలా దోషాలు చుట్టుముడుతుంటాయి. ఊరికి బ్రహ్మస్థానంలో ఏదైనా ఆలయ నిర్మాణం చేసి, ఎవరి గృహంలో వారు యంత్రప్రతిష్టలు, రత్నధారణలు చేసుకొంటే దాదాపు యాభై శాతం సమస్యలు తగ్గుతాయి.

వి.ప్రతిమ వరికుంటపాడు

** నవగ్రహ ప్రదక్షిణలు చేశాను. మొక్కుబడులు సమర్పించాను. దోషాలకు అమ్మవారికి కోళ్లు బలి యిచ్చాను. అయినా మా ఇంట్లో పరిస్థితులు ఏ మాత్రం బాగుపడలేదు. మార్గం చూపించండి స్వామీ!?*

మీ నిష్ట, భక్తి ప్రపత్తులకు ఆశీర్వాదాలు. మీరు యంత్రప్రతిష్ట చేసుకోండి. దేవతలకు బలులు సమర్పించడం (జంతు, పక్షి బలులు) తప్పు. శాస్త్రీయ బలులైన నారికేళ (టెంకాయ), కూష్మాండ (గుమ్మడికాయ) వంటివి సమర్పించవచ్చు. యంత్ర ప్రతిష్టల కోసం ఒకమారు సంప్రదించండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
సెల్: 9490125878.

పి.శాలిని ఆత్మకూరు

** 'తులసికోట' పూజ కలిసిరాదంటారు అత్త గారు. నాకేమో తులసి పూజ యిష్టం. మీరు చెప్పండి స్వామీ?*

తులసి లక్ష్మీ సమానం. లక్ష్మీదేవి పూజ కలసి రాదనడం (మూర్ఖత్వం). అయితే ఒక పద్ధతి చెబుతారు శాస్త్రంలో - కలసి రాదు అన్న అనుమానాలున్న వ్యక్తులు మొదట వైష్ణవాలయాలలో అర్చన చేసుకొని తర్వాత లక్ష్మీతులసి (పచ్చగా వుంటుంది) లేదా కృష్ణతులసి (నల్లగా వుంటుంది) మొక్కను గురువారం మాత్రమే (లక్ష్మీవారం) తులసి కోటలో నాటి పూజ ప్రారంభించవచ్చు. ఏ అభ్యంతరమూ వుండదు. వాళ్లకా గిలి కూడా పోతుంది.

వై.సి.ప్రణతిరెడ్డి సూళ్లూరుపేట

** స్వామీ! వైద్య జ్యోతిష్యం ఉందా?*

వైద్య జ్యోతిష్యం! జ్యోతిష శాస్త్రంలో వృక్ష పూజా వైద్యం వుంది! మీ జన్మ నక్షత్రాలను బట్టి వచ్చే దేవతా వృక్షాల్ని, వాటి పూజలు, వాటి అనారోగ్య నివారణ సేవనలు అందులో ఆయుర్వేద పరంగా వున్నాయి. నిపుణులైన వారు మీకు మంచి సలహాలు ఇవ్వగలరు.

యు.సుహాసిని కావలి

** మేము యంత్ర పూజ చేసేటప్పుడు ఏ వైపు చూస్తూ పూజ, ప్రార్ధన చేయాలి?*

యంత్రం తూర్పు చూడాలి. మీరు దక్షిణం వైపు కూర్చుని ఉత్తరం చూస్తూ పూజ చేయండి. ఇంట్లో ఏదైనా మతపరమైన అభ్యంతరాలుంటే యంత్రాన్ని పశ్చిమ వాయువ్యం చూపిస్తూ (నైరుతి వద్దు) మీరు ఉత్తర వాయువ్యం చూస్తూ పూజ చేయండి.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/2024-26

● కాదంబరి జత్వాని కేసు

ప్రభుత్వం పరువు తీసింది

ఐదేళ్ల జగన్ పాలన రాక్షస సదృశ్యమని ప్రజలు అభిప్రాయపడడానికి కాదంబరి జత్వాని కేసు కూడా ఒక కారణం. ఎక్కడో బొంబాయిలో సినిమాలలో చిన్న చిన్న పాత్రలలో నటిస్తూ జీవనం సాగించే ఒక ఆడపిల్లను ఒక పారిశ్రామికవేత్త మెప్పు కోసం నానా యాతన పెట్టారన్నది అప్పటి ప్రతిపక్షం, ఇప్పటి ప్రభుత్వ పక్షమైన తెలుగుదేశం ప్రధాన ఆరోపణ. ఆ కారణంతోనే, తాము అధికారంలోకి రాగానే సీనియర్ పోలీసు అధికారులు ముగ్గురిని సస్పెండ్ చేశారు. టీవీ ఛానళ్లలో రోజుల తరబడి డిబేట్లు పెట్టి, ప్రచారం చేశారు. ఆ ఆడపిల్ల పట్ల పోలీసు దురుసు ప్రవర్తన ఘోరంగా వుండిందన్న ప్రచారం ఉధృతంగా సాగింది. ఆమెను బొంబాయి నుంచి రప్పించి, ఫిర్యాదు తీసుకొని, ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించి, నానా హడావుడి చేశారు. కానీ తీరా రెండేళ్లు గడిచిన తర్వాత ఏ ప్రముఖ వ్యక్తి కోసం జగన్ ఇంత అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలుగుదేశం పార్టీ నిందించిందో, అదే ప్రముఖ వ్యక్తితో అదే తెలుగుదేశం అగ్రనేతల గణం ఒప్పందాలు కుదుర్చుకొన్నది. వేదికలు పంచుకొని మరీ ఒకరి మీద మరొకరు ప్రశంసల జల్లు కురిపించుకొన్నారు. ఈ మారిన పరిస్థితులలో ఆ ఆడపిల్ల మీద జగన్ పెట్టిన కేసును న్యాయస్థానం వరకు తీసుకవెళ్లారు. అది తప్పుడు కేసని సాక్షాత్తు ముఖ్యమంత్రి చెప్పిన మాట మరచిపోయారు. ఆ కేసుకు కారణమని భావించి, సస్పెండ్ చేసిన ఉన్నతస్థాయి పోలీసు అధికారుల మీద నేరారోపణ సంగతి పక్కన పెట్టేశారు. అంటే, జగన్ చేసింది సరైనదని చంద్రబాబు ప్రభుత్వం నిర్ధారించిందన్న మాట. ఇంతకంటే సిగ్గుమాలిన తనం వేరొకటి వుండదు. కేసు పూర్వాపరాలలోకి మేము వెళ్లదలచడం లేదు. అది కోర్టు పరిధిలో వుంది కాబట్టి ఆ చర్చ నిషేధం కూడా. కానీ తమ దిగజారుడు తనం పట్ల, తమ లాలూచీ వ్యవహారాల వల్ల ప్రభుత్వ ప్రతిష్ట ఎంత మసకబారి పోతుందో కూడా పట్టించుకోకుండా ఈ నిర్ణయం తీసుకొన్నారంటే, చంద్రబాబు బృందం అన్ని సిగ్గు బిడియాలూ వదిలేసిందని భావించడం తప్పుకాదేమో. న్యాయస్థానంలో కేసు పత్రాలు దాఖలు చేయడంలో పోలీసు ప్రదర్శించిన అపరిపక్వతలోనే దీని వెనుక భారీ లాలూచీ వుందన్న విషయం అర్థమై పోతున్నది. ఈ కేసులో కాదంబరి జత్వాని కుటుంబ సభ్యుల ప్రమేయం లేదని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు; కానీ వారిని నిందితులుగా చేర్చారు; రెండు రోజుల తర్వాత తప్పు, తప్పు, వారి పేర్లు ఛార్జిషీటులో నుంచి తీసేయండి అని కోర్టును వేడుకొన్నారు. దీని భావం ఏమి తిరుమలేశా?

నేను కాక్రోచ్ అన్న జగన్ ఇప్పుడేమయ్యాడు?

బొద్దింకల భూకంపంతో దేశ రాజకీయాలన్నీ తీన్తార్‌గా మారుతుంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రధాన రాజకీయ పార్టీలు రెండూ తమ నోళ్లకు తాళాలు బిగించుకొని వున్నాయి. తెలుగుదేశం లేదా జనసేన ఈ విషయంలో పెద్దగా స్పందించే అవకాశం లేదు. వారు బిజెపితో కూటమిలో సభ్యులు కాబట్టి, బొద్దింకల పోరాటం సమస్తం బిజెపిపైన కేంద్రీకృతమై వుంది కాబట్టి, మౌనం వహించడం తప్పనిసరి. ఏ మాత్రం నోరు జారినా మోడీ కన్నెర్ర చేస్తాడు. ఆయన కన్నెర్ర చేయడం అంటే, కాకిలా మల మల మాడిపోవడం క్రిందే లెక్క. అంత దుస్సాహసం చేసే స్థితిలో చంద్రబాబు లేడు; పవన్ కళ్యాణ్ అసలే వుండడు.

కానీ జగన్‌కు ఆ బంధాలు లేవు. ఆయన బిజెపి అధికారికంగా పొత్తులో లేదు. పైగా, కాక్రోచ్ ఉద్యమం మొదలైన వెంటనే ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నేను కూడా కాక్రోచ్ అవుతానని ప్రకటించుకొన్నాడు జగన్. అదెంత హాస్యాస్పదమైన వ్యాఖ్య అన్నది ప్రక్కనపెడితే, ఆ కాక్రోచ్ ఇప్పుడేమైంది అన్న ప్రశ్న తలెత్తుతున్నది. ఢిల్లీలో అంత రచ్చ జరుగుతుంటే జగన్ కానీ, ఆయన పార్టీ నేతలు కానీ నోరు తెరవడం లేదు. ఈ ఉద్యమకారుల మీద పోలీసు దౌర్జన్యాన్ని దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఖండిస్తున్నాయి. సినిమా నటులు కూడా ముందుకు వస్తున్నారు. అంతర్జాతీయ పత్రికలన్నిటిలో ఇదే పతాక శీర్షిక. మన దేశంలో టీవీ ఛానళ్లు, పత్రికలు ఇటువంటి వార్తలు ప్రచురించే స్థితిలో లేవు. వాటి యాజమాన్యాలన్నీ అంబానీ లేదా అదానీ నియంత్రణలో వున్నాయి కాబట్టి, భావప్రకటన స్వేచ్ఛ అనే మాట తమ మనసులలోను నుంచి తీసి పారేయగలిగే పాత్రికేయులు మాత్రమే వాటిలో పని చేస్తున్నారిప్పుడు. కానీ జగన్ వంటి స్వతంత్ర భావాలున్న నాయకులు యువత మీద తీవ్రమైన ప్రభావం చూపుతున్న ఈ సంఘటనల పట్ల కనీసపాటి స్పందన కూడా చూపలేక పోవడం విచిత్రంగా వుంది. బొద్దింకలకు అనుకూలంగా మాట్లాడితే ఈడి దాడులు జరుగుతాయన్న భయమే జగన్ మౌనానికి కారణం కావచ్చు. పాపం, జగన్.

ఆస్థాన వాస్తు పండితుడి అతిశయం

నేను ముహూర్తం పెట్టకుండా మంత్రివర్గ విస్తరణా?

చంద్రబాబు నాయుడు నాస్తికుడు కాదు కానీ, అంధ భక్తుడు కాడు. వాస్తు వంటి పట్టింపులు వుండేవి కావు. తన పేరుతో దేవాలయాలలో పూజలు చేయిస్తామని వచ్చే నాయకులకు తన గోత్రం చెప్పడానికి కూడా ఇష్టపడే వాడు కాడు. నేనిక్కడ కూర్చుని వుంటే, అక్కడ నువ్వు పూజించే దేముడు నాకు మేలు చేస్తాడా అనేవాడు. ఒక్క తిరుమల వెంకన్న సేవ మాత్రమే నిష్టగా నిర్వహించడం ఆయనకు అలవాటు. ఈ నలభై ఏళ్ల ప్రజా జీవితంలో చంద్రబాబు ఒక స్వామీజీకి మొక్కినట్లు కానీ, ఒక వాస్తు పండితుడు చెప్పాడని గోడలు కూల్చిన సందర్భం కానీ లేవు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయినట్లు కన్పిస్తున్నది. వయస్సు ప్రభావమో లేక కుటుంబ ఒత్తిళ్ల ఫలితమో కానీ, తన కుర్చీ గదిలో ఏ మూల వేసుకోవాలో, తానే దిక్కుకు తిరిగి మాట్లాడాలో కూడా వాస్తు పండితులు చెప్పనిదే చేయడం లేదట. ముఖ్యమంత్రి కార్యాలయంలో కూడా ఈ వాస్తు మార్పులు చాలానే జరిగినట్లున్నాయి. మరొక ప్రక్క యాగాలు, హోమాలు నిర్వహించడం చంద్రబాబు ఇంట్లో ఒక నిత్యాగ్ని హోత్రం వలె నడిచిపోతున్నది.

ఈ మార్పులన్నిటికీ సూత్రధారి – జయరామి రెడ్డి అనే వాస్తు పండితుడు. ఆయన మార్టేరు ప్రాంతవాసి అట. మూడు నాలుగేళ్ల క్రితం ఆయనకు చంద్రబాబుతో సంపర్కం కుదిరినట్లు తెలుస్తున్నది. ఎన్నికలకు ముందు నుంచే ఆయన ప్రభావం తెలుగుదేశం పార్టీ మీద కన్పిస్తూ వచ్చింది. ఉండవల్లిలో చంద్రబాబు నాయుడు నిర్మిస్తున్న ఐదెకరాల సువిశాల రాజభవనం రూపశిల్పి కూడా జయరామిరెడ్డే నని చెప్పున్నారు. ఈ ఇంటి నిర్మాణం ముగిసి, గృహప్రవేశం జరిగిన తర్వాత చంద్రబాబుకి, శత్రువు అనేవాడు మిగలడని హామీ ఇచ్చాడట జయరామిరెడ్డి. దాని అర్థం శత్రువులు అంతమై పోతారనా లేక ఆయన అజాత శత్రువుగా మారుతాడనా అన్నది మనకు తెలియదు. నెల్లూరులో జరపతలపెట్టిన మహానాడు ఏర్పాట్లకు కూడా ముందు వచ్చాడు జయరామిరెడ్డి. ఆయన ముహూర్తబలం పని చేయలేదో లేక మోడీ పట్ల వున్న భయభక్తులు అధికం కావడం వల్లనో కానీ, అసలా మహానాడే రద్దయి పోయింది. చంద్రబాబు నాయుడుతో పాటుగా ఆయన కుటుంబ సభ్యులందరితో జయరామిరెడ్డి పెంచుకొన్న సాన్నిహిత్యం పార్టీలోని వారందరికీ తెలిసిపోయింది. అందువల్ల ఆయన కన్పిస్తే, ఎంతటివాడైనా వినయంగా తల వంచి దండం పెట్టక తప్పడం లేదు.

ఈ నేపథ్యంలో ఒక మంత్రిపదవి ఆశావహుడు ఇటీవల ఆయన్ను కలిసి, తన పేరు సిఫార్సు

చేయమని కోరాడట. ఈ నెలలోనే విస్తరణ జరిగిపోబోతున్నది కాబట్టి, వీలైనంత త్వరగా సిఫార్సు చీటీ దయచేయమని కోరాడట ఆ ఆశావహుడు. దానికాయన చెప్పిన సమాధానం విని, యావత్ తెలుగుదేశం పార్టీ నిరుత్తరంగా మారిపోతున్నదిప్పుడు. "నేను ముహూర్తం పెట్టకుండా మంత్రివర్గ విస్తరణ ఎట్లా జరుగుతుంది, నేను చెప్తే తప్ప చంద్రబాబు ఇంట్లో నుంచి బయట కాలు కూడా పెట్టడు కాబట్టి నేను గ్రీన్ సిగ్నల్ ఇచ్చేవరకు మంత్రివర్గ విస్తరణ జరిగే ప్రశక్తే లేదు, నువ్వు ధీమాగా వుండమని ధైర్యం చెప్పి పంపాడట ఆ వాస్తు పండితుడు.

సంజయ్ గాంధీ వద్ద ధీరేంద్ర బ్రహ్మచారి, పివి.నరసింహారావు వద్ద చంద్రస్వామి వలె చంద్రబాబు దగ్గర జయరామిరెడ్డి పలుకుబడి దేదీప్యమానంగా వెలుగొందుతున్నదని పార్టీ వర్గాల భోగట్టా.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: +91-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : zaminryot1930@gmail.com, website: www.zaminryot.com